


Truth of News
RNI NO : APTEL/25/A0239
# సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 201 | ఆదివారం 11 జనవరి 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50
Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## రేపు నింగిలోకి 'అన్వేష్ ఉపగ్రహం

- పిఎస్ఎల్వీబిసి 62 ప్రయోగానికి సర్వం సిద్ధం
- నేడు కౌంట్ డౌన్

సూళ్లూరుపేట - సూర్య వాస్తవం

గత నెల డిసెంబర్‌లో ఎల్‌వీఎం3బి ఎం6 భారీ ప్రయోగం విజయం తర్వాత మరో విజయానికి ఇస్రో సిద్ధమవు తోంది. ఇందుకు సంబంధించి పిఎస్ఎల్వీబిసి 62 రాకెట్ ద్వారా జనవరి 12న ఉదయం 10 గంటల 17 నిమిషాలకు అన్వేష్ (ఇఒఎస్‌బిఎన్1) ఉపగ్రహాన్ని నింగిలోకి పంపనుంది. దీంతో పాటు మరో 15 వాణిజ్య ప్రయోగాలను ఉపగ్రహాలను రోదసిలోకి ప్రవేశ పెట్టనున్నారు. ఈ ప్రయోగానికి సంబంధించి ఆదివారం ఉదయం 10గంటల 17 నిమిషాలకు కౌంట్‌డౌన్

- మిగతా 2లో..



## కోడి పందేలను అడ్డుకోండి

- అధికారులకు హైకోర్టు ఆదేశం

అమరావతి - సూర్య వాస్తవం

సంక్రాంతి పండగకు కోడి పందేలు నిర్వహిస్తే జంతుహింస నిరోధక చట్టం 1960, ఎపి జూద నిరోధక చట్టం-1974 కింద చర్యలు తీసుకోవాలని జిల్లాల కలెక్టర్లు, ఎస్పిలను హైకోర్టు ఆదేశించింది. పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు జిల్లాల్లో సంక్రాంతి పండగకు కోడి పందేలు నిర్వహించే సంప్రదాయ నేపథ్యంలో ఆ చట్టాలను కట్టుదిట్టంగా అమలు చేయాలంది. చట్టాల ఉల్లంఘనలు జరిగితే వ్యక్తిగతంగా బాధ్యత వహించాల్సి ఉంటుందని



అధికారులను హెచ్చ రించింది. కింది స్థాయి అధికారులు చట్టాలను అమలు చేయకపోతే వారిపై జిల్లా స్థాయి ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలంది. తనిఖీలకు ఎస్ఐ సాయికి తగని పోలీసు అధికారి,

- మిగతా 2లో..

## ప్రజారోగ్య సంరక్షణకు ప్రాధాన్యమిస్తున్నాం

- నిరంతరం నేర్చుకోవడమే అతిపెద్ద విజయరహస్యం
- ఫెలోస్ ఇండియా కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ - సూర్య వాస్తవం

'నేను డాక్టర్‌ను కాదు.. కానీ, సోషల్ డాక్టర్‌ను. తెలంగాణలో ప్రజల ఆరోగ్య సంరక్షణకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నాం. హైదరాబాద్ లో ఫెలోస్ ఇండియా కాన్ఫరెన్స్ జరగడం సంతోషం. ఆగ్నేయాసియా దేశాల నుంచి 500 మందికిపైగా వచ్చిన యువ కార్డియాలజిస్టులందరికీ స్వాగతం. మీరంతా సక్సెస్ ఫుల్ కార్డియాలజిస్టులు. అయినా, మీ నాలెడ్జ్‌ని ఎప్పటికప్పుడు అప్ గ్రేడ్ చేసుకోవడంతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఇక్కడకొచ్చారు. నిరంతరం నేర్చుకోవడమే అతిపెద్ద విజయ రహస్యం. కొత్త విషయాలను తెలుసుకోవడం, నైపుణ్యాన్ని పెంచుకోవడం మానేస్తే కెరీర్‌కు ముగింపు పలికినట్లే' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శనివారం హోటల్ హెచ్ఐసీసీలో ఫెలోస్



ఇండియా కాన్ఫరెన్స్‌లో సీఎం పాల్గొని మాట్లాడారు. ఈ కాన్ఫరెన్స్ హైదరాబాద్ లో జరగడం ఎంతో గర్వకారణమన్నారు. లైఫ్ సైన్సెస్, ఫార్మా, హెల్త్ కేర్ అనుబంధ రంగాలలో ఆవిష్కరణల కేంద్రంగా హైదరాబాద్ వేగంగా

- మిగతా 2లో..

## అమరావతి అన్‌స్టాపబుల్

- కొందరు అసూయతో కలలు కంటున్నారు...
- విజయవాడ సిద్ధార్థ అకాడమీ స్వర్ణోత్సవాల్లో పాల్గొన్న సీఎం చంద్రబాబు
- అమరావతిని ఎవరూ అడ్డుకోలేరని, విమర్శలు అర్థరహితమని స్పష్టీకరణ
- 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధనే లక్ష్యమని,
- తెలుగు జాతిని అగ్రస్థానంలో నిలుపుతామని ధీమా
- తిరుపతిలో స్పేస్ సిటీ, కర్నూలులో డ్రోన్ సిటీ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడి




విజయవాడ - సూర్య వాస్తవం

ఎవరెన్ని కుట్రలు పన్నినా ప్రజా రాజధాని అమరావతి అన్‌స్టాపబుల్ అని, దానిని ఎవరూ అడ్డుకో లేరని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. కొందరు అసూయతో కలలు కంటున్నారని, అది ఎప్పటికీ జరగని పని అని ఉద్ఘాటించారు. నీరు ఉన్నచోటే నాగరికత అభివృద్ధి చెందుతుందన్న ప్రాథమిక అవగాహన లేనివారు రాజకీయాల్లో ఉండటం దురదృష్టకర మని వ్యాఖ్యానించారు. శనివారం నాడు విజయవాడలోని సిద్ధార్థ అకాడమీ విద్యాసంస్థల స్వర్ణోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలను అమరావతికి తీసుకొచ్చి, దానిని మేటి విద్యా కేంద్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.

### విద్యారంగంలో సిద్ధార్థ అకాడమీ సేవలు అమోఘం

విజయవాడను 'విద్యలవాడ'గా మార్చడంలో సిద్ధార్థ అకాడమీ విద్యా సంస్థలు కీలక భూమిక పోషించాయని చంద్రబాబు

- మిగతా 2లో..

## నారా భువనేశ్వరికి మరో విశిష్ట పురస్కారం...

- గర్విస్తున్నానంటూ సీఎం చంద్రబాబు స్పందన
- నారా భువనేశ్వరికి 'అవుట్‌స్టాండింగ్ డెయిరీ ప్రొఫెషనల్ల అవార్డు
- మహిళా సాధికారతకు చేస్తున్న సేవలకు ప్రశంసలు
- భువనేశ్వరి కృషి స్ఫూర్తిదాయకమన్న సీఎం చంద్రబాబు
- ఈ గౌరవం పాడి రైతులకే చెందుతుందన్న భువనేశ్వరి



2లో

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## వ్యవసాయానికి ఆటంకం లేకుండా ఉపాధి..

- ఉపాధి హామీ స్థానంలో వచ్చిన 'జీ రామ్ జీ' పథకంపై సీఎం చంద్రబాబు సమీక్ష
- ఉపాధి కల్పనతో పాటు గ్రామాల్లో ఆస్తుల సృష్టి లక్ష్యంగా అమలుకు ఆదేశం
- కూటమి భాగస్వాములైన బీజేపీ, జనసేన నేతలతో సీఎం భేటీ
- స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాలకు అనుగుణంగా పథకం అమలుకు ప్రణాళిక

అమరావతి - సూర్య వాస్తవం

కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ అజీవికా మిషన్ (గ్రామీణ్) - వీబీ జీ రామ్ జీ' పథకాన్ని పేదలకు ఉపాధి కల్పించడంతో పాటు గ్రామాల్లో శాశ్వత ఆస్తులను సృష్టించేలా అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (నరేగా) స్థానంలో వచ్చిన ఈ నూతన పథకంపై రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు



అవగాహన కల్పించేందుకు కూటమి పక్షాలు ఉమ్మడిగా కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. శనివారం నాడు అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, రాష్ట్ర మంత్రి, జనసేన నేత కందుల దుర్గేష్ సమావేశమయ్యారు. ఈ భేటీలో 'జీ రామ్ జీ' పథకం అమలు, దాని ద్వారా రాష్ట్రానికి ఒనగూరే ప్రయోజనాలపై కూలంకషంగా చర్చించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, "వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల సమగ్రాభివృద్ధి

- మిగతా 2లో..



## మతాల మధ్య చిచ్చు పెట్టేవారి పట్ల అప్రమత్తత అవసరం

- శాంతి భద్రతల పరిరక్షణలో రాజీపడొద్దు
- కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయాన్ని సందర్శించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

కాకినాడ - సూర్య వాస్తవం

శాంతి భద్రతల పరిరక్షణ వ్యవహారంలో కఠినంగా వ్యవహరించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచించారు. లా అండ్ ఆర్డర్ నిర్వహణ పకడ్బందీగా ఉంటూ నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని, ఉల్లంఘనలకు పాల్పడే వారు ఎంతటి వారైనా ఉపేక్షించవద్దని తెలిపారు.

- మిగతా 2లో..

# కోడి పందేలను అడ్డుకోండి

(మొదటిపేజీ తరువాయి)
తహశీల్దార్, భారత జంతు సంక్షేమ బోర్డు ప్రతినిధి లేదా జంతు సంరక్షణ కోసం పనిచేసే ఎన్‌జిఒ ప్రతినిధులకు కమిటీలో చోటు కల్పించాలంది. కమిటీ తనిఖీలు చేసి కోడి పందేలు జరగకుండా ఉన్నతాధికారులకు సహకరించాలంది. కోడి పందేలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్న వినతులను ప్రభుత్వ అధికారులు పట్టించుకోవడం లేదంటూ దాఖలైన పలు పిటిషన్లపై ఈ మేరకు జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప తీర్పు చెప్పారు.

# రేపు నింగిలోకి 'అన్వేష్ ఉపగ్రహం

(మొదటిపేజీ తరువాయి)
ప్రక్రియ ప్రారంభం కానుంది. ఇది 24 గంటల పాటు కొనసాగిన అనంతరం సోమవారం పిఎస్ఎల్‌వి బిసి 62 రాకెట్ నింగిలోకి ప్రయోగిస్తారు. శ్రీహరికోటలోని ఇంటిగ్రేషన్ ఫెసిలిటీ భవనం (పిఐఎఫ్)లో రాకెట్ అనుసంధానం కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఈ ప్రయోగంలో 1,485 కేజీల బరువు ఉన్న అన్వేష్ ఉపగ్రహాన్ని ప్రయోగిస్తున్నారు. ఇది అత్యంత కీలకమైన ఉపగ్రహం. ఇప్పటివరకు భారత రక్షణ వ్యవస్థకు మూడో నేత్రంలా పనిచేసే భూ పరిశీలన ఉపగ్రహాలను అనేకం ఇస్రో అంతరిక్షంలోకి పంపింది. భూ పరిశీలన చేసిన తర్వాత సమాచారాన్ని భూమికి చేరవేసే ప్రక్రియను దృష్టిలో ఉంచుకొని ఈ ఉపగ్రహానికి అన్వేష్ అనే నామకరణం చేశారు. ఈ ఉపగ్రహం సైనిక అవసరాల నిఘా నిమిత్తం భూమికి 600 కిలోమీటర్ల ఎత్తులో పరిభ్రమిస్తూ సమాచారాన్ని భూతలంలోని కంట్రోల్ సెంటర్‌కు చేరవేస్తుంది. ఈ ప్రయోగంలో స్పానిష్‌కు చెందిన స్టార్టప్ ఆర్బిటల్ పారడైజ్ భాగస్వామ్యంతో నిర్మించిన 25 కేజీల బరువు గల క్రిస్టల్ ఇనిషియల్ డెమానిస్ట్రేటర్ (కెఐడి) క్యాప్సూల్‌ను ప్రయోగాత్మకంగా పరీక్షించనున్నారు.

**శ్రీవారి సేవలో ఇస్రో చైర్మన్ నారాయణన్**
**-- చెంగాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు**

ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. శనివారం ఉదయం విఐపి విరామ సమయంలో స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ నెల 12న పిఎస్ఎల్‌వి-సి62 రాకెట్ ద్వారా గగనతలంలోకి పంపనున్న ఇఒఎస్-ఎన్1 విజయవంతం కావాలని ఉపగ్రహ నమూనాను శ్రీవారి పాదాల చెంత ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రంగనాయకుల మండపంలో రాకెట్ నమూనాలకు, ఇస్రో చైర్మన్ నారాయణన్, శాస్త్రవేత్తలకు వేదపండితులు ఆశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు ఇస్రో చైర్మన్‌ను పట్టువస్త్రంతో సత్కరించి శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. ఈ ఏడాదిలో ఇదే మొదటి ప్రయోగమని, పిఎస్ఎల్‌వి సి 62 రాకెట్ ద్వారా భూ పరిశీలన కోసం ఇఒఎస్-చీ1 ఉపగ్రహంతో పాటూ వివిధ దేశాలకు చెందిన ఎనిమిది మైక్రో శాటిలైట్‌లను కూడా ప్రయోగిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం శ్రీచెంగాలమ్మ పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

# ప్రజారోగ్య సంరక్షణకు ప్రాధాన్యమిస్తున్నాం

(మొదటిపేజీ తరువాయి)
అభివృద్ధి చెందుతున్న తీరును వివరించారు. డాక్టర్లు సమాజంలో ఒక ప్రత్యేక గ్రూపునకు చెందినవారనీ, ప్రాణాలు కాపాడుతారని మేం బలంగా నమ్ముతామని చెప్పారు. మనుషుల పట్ల, సమాజం పట్ల బాధ్యతను ఎప్పటికీ మరచిపోవద్దని డాక్టర్లకు సూచించారు. ప్రజల ప్రయోజనాల కోసం తమ ప్రభుత్వ పాలసీని మెరుగుపరచడానికి వైద్యులతో కలిసి పనిచేయడానికి తాము ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని ప్రకటించారు. విజ్ఞానం, సాంకేతికత ప్రపంచాన్ని చాలా వేగంగా మారుస్తున్నాయనీ, క్వాంటం కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇతర సాంకేతి కతలతో ఆరోగ్య సంరక్షణ హై టెక్నాలజీతో ముడిపడి ముందుకెళ్తున్నదని చెప్పారు. ఈ మధ్య కాలంలో గుండె జబ్బులతో చాలా మంది చనిపోతుండటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఆర్ ద్వారా చాలా మంది ప్రాణాలను కాపాడొచ్చనీ, దానిపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని కోరారు. గుండె జబ్బులను నివారించే మిషన్‌లో మనమందరం భాగస్వాములం అవుదామన్నారు. ఆరోగ్య సంరక్షణలో మన దేశం వరల్డ్ బెస్ట్ అవ్వాలనీ, ప్రతి ఒక్కరూ ఉత్తమ వైద్యుడుగా ఎదిగేందుకు ప్రయత్నించాలని ఆకాంక్షించారు.

## మతాల మధ్య చిచ్చు పెట్టేవారి పట్ల
# అప్రమత్తత అవసరం

(మొదటిపేజీ తరువాయి)
కులాల మధ్య మతాల మధ్య చిచ్చుపెట్టాలని చూసే శక్తుల పట్ల అప్రమత్తతతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. నిబంధనలకు అనుగుణంగా పని చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని చెప్పారు. శనివారం మధ్యాహ్నం కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయాన్ని సందర్శించారు. కమాండ్ కంట్రోల్ రూం, ఆఫీసర్స్ జిమ్ తదితర విభాగాలను పరిశీలించారు. కమాండ్ కంట్రోల్ రూంలో డయల్ 100 పని తీరుపై ఆరా తీశారు. అత్యవసర పరిస్థితుల్లో బాధితులు ఫోన్ చేసినప్పుడు సాంకేతికత సాయంతో వారి లొకేషన్ ఎలా గుర్తిస్తారౌదగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్ సిబ్బందికి సమాచారం ఎలా చేరవేస్తారు. తదితర అంశాలను పోలీస్ అధికారులు పవన్ కళ్యాణ్ కి వివరించారు. స్నేహపూర్వక సేవలు అందిస్తూ పోలీస్ వ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు సూచించారు

## నారా భువనేశ్వరికి
# మరో విశిష్ట పురస్కారం...

**అమరావతి – సూర్య వాస్తవం**
ముఖ్యమంత్రి చంద్రబాబు తన అర్ధాంగి, హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా భువనేశ్వరిపై ప్రశంసలు కురిపించారు. ఆమెకు మరో ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పాడి రైతుల అభ్యున్నతి, మహిళా సాధికారత కోసం భువనేశ్వరి చేస్తున్న కృషి ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ పురస్కారం ఆమెకు, ఆమె బృందానికి దక్కాల్సిన సరైన గుర్తింపు అని పేర్కొన్నారు. ఈ గౌరవం వెనుక ఆంధ్రప్రదేశ్‌లోని వేలాది మంది పాడి రైతుల కృషి ఉందని చంద్రబాబు పేర్కొన్నారు. ఇండియన్ డెయిరీ అసోసియేషన్ (సౌత్ జోన్) నారా భువనేశ్వరికి 'అవుట్‌స్టాండింగ్ డెయిరీ ప్రొఫెషనల్ల అవార్డును ప్రకటించింది. డెయిరీ రంగంలో ఆమె అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందజేశారు.

# అమరావతి అన్‌స్టాపబుల్

(మొదటిపేజీ తరువాయి)
ప్రశంసించారు. ఐదు దశాబ్దాలు పూర్తి చేసుకోవడం ఒక చరిత్రాత్మక ఘట్టమని, క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను అందించి లక్షలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దడం అభినందనీయమని అన్నారు. తాను గతంలో సిద్ధార్థ అకాడమీ సిల్వర్ జూబ్లీ వేడుకలకు, ఇప్పుడు గోల్డెన్ జూబ్లీ వేడుకలకు హాజరుకావడం సంతోషంగా ఉందని గుర్తు చేసుకున్నారు. అగ్రిటెక్ కళాశాలను ఏర్పాటు చేస్తే ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని ఈ సందర్భంగా ప్రకటించారు. 1975లో కొందరు ప్రముఖులు ప్రారంభించిన ఈ సంస్థ, నేడు 28 వేల మంది విద్యార్థులు, 4 వేల మంది సిబ్బందితో మహావృక్షంగా ఎదిగిందని కొనియాడారు.

**అమరావతిపై కుట్రలను తిప్పికొడతాం**

కొందరి అసూయకు హద్దు లేకుండా పోతోందని, గత ప్రభుత్వ హయాంలో అమరావతిని ఆపేందుకు చేసిన కుట్రలను ప్రజలు చూశారని చంద్రబాబు అన్నారు. అయినా వారికి బుద్ధి రాలేదని విమర్శించారు. నదీ పరివాహక ప్రాంతంలో రాజధాని కడుతున్నారని అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని, ఢిల్లీ, చెన్నై, రాజమండ్రి వంటి నగరాలన్నీ నదీ తీరాల్లోనే ఉన్నాయన్న విషయం వారికి తెలియదా అని ప్రశ్నించారు. అమరావతిని పవిత్ర జలాలు, మట్టితో పునీతం చేశామని, భవిష్యత్తులో విజయవాడ, గుంటూరు, మంగళగిరి కలిసి అద్భుత నివాస ప్రాంతంగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఆరు నెలల్లో అమరావతిలో క్వాంటమ్ కంప్యూటర్ సెంటర్ వస్తుందని, రెండేళ్లలో ఇక్కడి నుంచే ప్రపంచానికి క్వాంటమ్ కంప్యూటర్లను సరఫరా చేస్తామని వెల్లడించారు.

**విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు**

కూటమి ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని చంద్రబాబు తెలిపారు. తాను గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రతి కిలోమీటర్‌కు ఒక ప్రాథమిక పాఠశాల, ఐదు కిలోమీటర్లకు ఉన్నత పాఠశాల, ప్రతి మండలంలో జూనియర్ కళాశాల, ప్రతి రెవెన్యూ డివిజన్‌లో ఇంజినీరింగ్ కళాశాల, ప్రతి జిల్లాకు ఒక వైద్య కళాశాల ఏర్పాటు చేశామని గుర్తు చేశారు.

విభజన చట్టం ద్వారా రాష్ట్రానికి వచ్చిన ఐఐటీ, ఐఐఎం, ఎయిమ్స్, ఎన్ఐటీ వంటి ప్రతిష్ఠాత్మక జాతీయ విద్యా సంస్థలను రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేశామని వివరించారు. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు, తల్లిదండ్రులను భాగస్వాములను చేసేందుకు ఏడాదికి రెండుసార్లు మెగా పేరెంట్-టీచర్ సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు.

**అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం**

రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు.

విశాఖకు గూగుల్ వస్తోందని, ఇప్పటికే కాగ్నిజెంట్, టీసీఎస్ వంటి సంస్థలు కార్యకలాపాలు ప్రారంభిస్తున్నాయని తెలిపారు. రాయలసీమలో స్పేస్ సిటీ, డిఫెన్స్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నామని, కర్నూలు జిల్లా ఓర్వకల్లు డ్రోన్ హబ్‌గా మారబోతోందని చెప్పారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిటకే తీసుకెళుతున్నామని, ఆరోగ్య రంగాన్ని కృత్రిమ మేధతో అనుసంధానించి మెరుగైన సేవలు అందిస్తామని అన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో 2047 నాటికి భారత్ ప్రపంచంలో నంబర్ 1 స్థానానికి చేరుకుంటుందని, అదే సమయానికి ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నంబర్ 1 రాష్ట్రంగా నిలుస్తుందని చంద్రబాబు విశ్వాసం వ్యక్తం చేశారు.

## వ్యవసాయానికి
# ఆటంకం లేకుండా ఉపాధి..

(మొదటిపేజీ తరువాయి)
కోసం కేంద్రం ఈ పథకాన్ని తీసుకొచ్చింది. పాత పథకంతో పోలిస్తే, కొత్త మార్గదర్శకాల ప్రకారం 25 రోజులు అదనపు ఉపాధి లభిస్తుంది. ముఖ్యంగా వ్యవసాయ పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా నిబంధనలు రూపొందించడం శుభపరిణామం. దీనివల్ల కూలీలు, రైతులు ఇద్దరికీ మేలు జరుగుతుంది," అని వివరించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నరేగా నిధులతో సుమారు 25 వేల కిలోమీటర్ల సిమెంట్ రోడ్లు వేసి గ్రామాల్లో ఆస్తులు సృష్టించామని, కానీ గత ప్రభుత్వం ఆస్తుల కల్పనను పూర్తిగా విస్మరించిందని చంద్రబాబు విమర్శించారు. "జీ రామ్ జీ పథకాన్ని పక్కాగా అమలు చేయడం ద్వారా గ్రామాల్లో అనేక మౌలిక వసతులు కల్పించవచ్చు. నరేగాలో లేని సోలార్ లైటింగ్ సిస్టమ్స్ ఏర్పాటు వంటి పనులను కూడా ఈ పథకం కింద చేపట్టే వెసులుబాటు ఉంది. ఇది గ్రామాల రూపురేఖలను మారుస్తుంది" అని ఆయన పేర్కొన్నారు.

**స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాలతో అనుసంధానం**

కూటమి ప్రభుత్వం నిర్దేశించుకున్న 10 సూత్రాల ఆధారంగా రాష్ట్రాభివృద్ధికి 'జీ రామ్ జీ' పథకాన్ని అనుసంధానం చేయాలని సీఎం చంద్రబాబు సూచించారు. "కేంద్ర ప్రభుత్వ పథకాలను సమర్థంగా వినియోగించుకుంటే రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతుంది. ఈ స్కీం కింద గోకులాల నిర్మాణం, పశు గ్రాసం పెంపకం, ప్లాంటేషన్ వంటివి చేపట్టి ఉపాధి అవకాశాలు పెంచవచ్చు. జల్ జీవన్ మిషన్ వంటి పథకాలతో అనుసంధానించి ప్రతి ఇంటికి తాగునీరు అందించవచ్చు. పాఠశాలలు, ఆసుపత్రులు, కమ్యూనిటీ సెంటర్ల నిర్మాణం, మరమ్మతుల ద్వారా ఆస్తులను అభివృద్ధి చేసుకోవచ్చు" అని చంద్రబాబు అన్నారు. ఏ పనులు చేపట్టాలనే దానిపై గ్రామ సభల్లో ఆమోదం తీసుకోవాలని, పనుల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచడం ద్వారా పారదర్శకత పాటించాలని ఆదేశించారు. ఈ అంశంపై అసెంబ్లీలో చర్చిస్తామని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తోనూ కూటమి నేతలు సమావేశమై ఆయన సూచనలు తీసుకోవాలని తెలిపారు.

**మౌలిక వసతుల కల్పనకు అవకాశం: మంత్రి దుర్గేష్**

మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, 2014-19 మధ్య చంద్రబాబు హయాంలో ఉపాధి హామీ ద్వారా గ్రామాల్లో ఎన్నో ఆస్తులు సృష్టించారని గుర్తుచేశారు. "జీ రామ్ జీ పథకంతో నీటి భద్రత, మౌలిక వసతులు, జీవనోపాధికి భరోసా లభిస్తుంది. చెక్ డ్యాంల నిర్మాణంతో భూగర్భ జలాలను పెంచవచ్చు. అవినీతికి తావులేకుండా పటిష్టమైన నిబంధనలతో ఈ పథకాన్ని రూపొందించారు" అని అన్నారు.

**అవినీతికి ఆస్కారం లేని విధానం: మాధవ్**

బీజేపీ ఏపీ చీఫ్ మాధవ్ మాట్లాడుతూ, 'జీ రామ్ జీ' పథకంలో అవినీతిని అరికట్టేందుకు పూర్తిస్థాయిలో సాంకేతికతను వినియోగిస్తున్నారని తెలిపారు. "జియో రిఫరెన్స్, బయోమెట్రిక్ జియో స్పెషియల్ టెక్నాలజీతో పనులను పర్యవేక్షిస్తారు. వేతనాల చెల్లింపుల్లో జాప్యం ఉండదు. పీఎం గతిశక్తితో అనుసంధానం చేయడం ద్వారా అభివృద్ధి ఫలాలు అందరికీ చేరతాయి. చంద్రబాబు నాయకత్వంలో ఈ పథకం ఏపీలో సమర్థవంతంగా అమలవుతుందన్న నమ్మకం ఉంది" అని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

## సీఎం చంద్రబాబును కలిసిన
# ప్రకృతి వైద్య నిపుణుడు మంతెన

- ఏపీ ప్రభుత్వ ప్రకృతి వైద్య సలహాదారుగా మంతెన సత్యనారాయణ రాజు
- సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు
- రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగనున్న మంతెన
- యోగా, ప్రకృతి వైద్యంపై ప్రభుత్వానికి సలహాలు అందించనున్న వైనం



**అమరావతి – సూర్య వాస్తవం**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రకృతి వైద్య సలహాదారుగా ఇటీవల నియమితులైన ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు శనివారం నాడు సతీసమేతంగా ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయ్యారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా ముఖ్యమంత్రిని కలిసిన ఆయన, తనకు సలహాదారుగా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంతెన సత్యనారాయణ రాజుకు సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రకృతి వైద్య రంగంలో డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజుకున్న అనుభవాన్ని వినియోగించుకోవాలని భావించిన ప్రభుత్వం, ఆయన్ను రాష్ట్ర ప్రభుత్వానికి ప్రకృతి వైద్య సలహాదారుగా నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ డిసెంబర్ 29న అధికారికంగా ఉత్తర్వులు (జీవో) జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం, డాక్టర్ రాజు రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. రాష్ట్రంలో యోగా, ప్రకృతి వైద్యానికి సంబంధించిన విధానాలపై ప్రభుత్వానికి డాక్టర్ రాజు సలహాలు, సూచనలు అందించనున్నారు.

తెలుగు రాష్ట్రాల్లో ప్రకృతి సిద్ధమైన ఆహారపు అలవాట్లు, ఆరోగ్యకరమైన జీవనశైలిపై విస్తృతంగా ప్రచారం చేస్తూ మంతెన సత్యనారాయణ రాజు విశేష ప్రజాదరణ పొందారు. ఆయన అమరావతి సమీపంలో 'మంతెన ఆరోగ్యాలయం' పేరుతో ప్రకృతి చికిత్సాలయం, పరిశోధన కేంద్రాన్ని కూడా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

# సంపాదకీయం

## కాలుష్య కట్టడి ఎలా...



ముంబై నగర వాయు కాలుష్య సంక్షోభంపై బాంబే హైకోర్టు సుమోటోగా విచారణ చేపట్టి ఏళ్లు గడుస్తున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి మారకపోవడానికి ప్రధాన కారణం డేటా లేకపోవడం. నిబంధనల అమలులో వైఫల్యమేనని స్పష్టమవుతోంది. గాలి నాణ్యత క్షీణతకు, ఊపిరితిత్తుల వ్యాధులకు ప్రత్యక్ష సంబంధం ఉన్నట్లు ఎటువంటి ఆధారాలు లేవని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో పేర్కొనడం అందరి దృష్టిపథంలో ఉంది. అదే సమయంలో అసలు దానికి సంబంధం ఉందో లేదో నిర్ధారించే డేటా సేకరణ మాత్రం జరగలేదు. అది యాధృచ్ఛికమో.. లేక నిజంగానే కనెక్షన్ ఉందో తెలీదు కానీ.. ప్రభుత్వం " గాలి కాలుష్యకారకమైన వ్యాధులపై పోరాటానికి అవసరమైన ప్రయత్నాలు చేస్తున్నాం.." అని చెబుతూ ఉంటుంది. సెన్సార్లు పనిచేయకపోవడం అన్నది గాలి కాలుష్యం విషయానికి సంబంధించిన ఆందోళనలో ఒక పరిపాటిగా మారిపోయింది. కాలుష్య నియంత్రణ సెన్సార్లు అనేకచోట్ల పని చేయడం లేదని బాంబే హైకోర్టు స్వయంగా గుర్తించింది. నిర్మాణ ప్రాంతాల్లో కాలుష్య నివారణ మార్గదర్శకాలను అమలు చేస్తున్నట్లు బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ రికార్డుల్లో చూపిస్తున్నప్పటికీ, వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. అధికారిక డేటా అంతా బాగున్నట్లు భ్రమింపజేస్తున్నా, జనం అనుభవిస్తున్న కాలుష్యం మాత్రం వేరే కథ చెబుతోంది. జనసాంద్రతకు అనుగుణంగా సెన్సార్ నెట్‌వర్క్ లేకపోవడంతో, కోర్టులు కూడా సరైన సమాచారం లేని శూన్య స్థితిలో నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తోంది.పాండమిక్ తర్వాత మనం ఎదుర్కొంటున్న అతిపెద్ద ఆరోగ్య సంక్షోభం వాయు కాలుష్యమే అయినప్పటికీ, దీనిపై తగినంత శ్రద్ధ లేకపోవడం విచారకరం. ముంబై, ఢిల్లీ వంటి నగరాల్లో శ్వాస పీల్చడం అంటే రోజుకు పదుల సంఖ్యలో సిగరెట్లు తాగడంతో సమానమని వార్తలు వస్తున్నా, జనం దాన్ని అలవోకగా తీసుకుంటున్నారు. ఇది కేవలం ఆరోగ్య సమస్యే కాదు, పెరుగుతున్న వైద్య ఖర్చుల వల్ల దేశంపై భారీ ఆర్థిక భారంగా పరిణమిస్తోంది. ముక్కలు ముక్కలుగా ఉన్న నిబంధనలు, ఆచరణకు సాధ్యం కాని విధానాల వల్ల వాయు స్వచ్ఛత లక్ష్యాలు నెరవేరడం లేదు. ఈ పరిస్థితికి చాలా కారణాలున్నాయి. సరైన నియంత్రణలు లేకపోవడం...వాటిని అమలు చేయడంలో సమన్వయ లోపం, ఆశావహ విధానాలు లేకపోవడం.. వాస్తవికత ఆధారంగా పనిచేయకపోవడం ఇవన్నీ కారణాలే. స్వచ్ఛమైన గాలి కోసం మనం విధించుకునే లక్ష్యాలు..వేగంగా పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థ అవసరాల మధ్య సమతుల్యం కూడా అవసరమే. నా దృష్టిలో, ఇవన్నీ రెండు ప్రధాన లోపాలున్నాయి. ఒకటి డేటా లేకపోవడం.. అదే ముఖ్యమైంది. ఇక రెండోది ప్రత్యక్ష ఆర్థిక ప్రోత్సాహకాలు, జరిమానాలు లేకపోవడం. (కాలుష్య నియంత్రణకు సంబంధించి) ఈ వ్యాసంలో ప్రస్తావించిన ఇతర కారణాలు సహా మిగతా అన్ని అంశాలు..ఈ మొదటి లోపాన్ని సరిదిద్దకుండా పరిష్కరించలేము.కాలుష్యాన్ని నియంత్రించాలంటే ప్రతి వార్డులో, ప్రతి లోకాలిటీలో తక్కువ ఖర్చుతో కూడిన ఆధునిక సెన్సార్లను ఏర్పాటు చేయాలి. కేవలం ముంబైని మాత్రమే కాకుండా, ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ మొత్తాన్ని ఒకే 'ఎయిర్ షెడ్'గా పరిగణించి అధ్యయనం చేయాలి. సముద్రపు గాలుల వల్ల కాలుష్యం ఎక్కడి నుంచి ఎక్కడికి చేరుతుందో తెలిస్తేనే మూలాలను అరికట్టగలం. 2023లో ఎమి బాంబే, ఔఇఇఖీఎ వంటి సంస్థలు ఇచ్చిన నివేదికలను ఇప్పటికైనా అమలు చేయాలి. వీటితో పాటు, కాలుష్యం తగ్గించే వారికి పన్ను రాయితీలు ఇవ్వడం, ఉల్లంఘించే వారికి భారీ జరిమానాలు విధించడం వంటి 'ఫిస్కల్ ఇన్సెంటివ్స్' విధానాన్ని ప్రవేశపెట్టాలి. బలమైన రాజకీయ సంకల్పం లేకపోతే, మనం పీల్చే గాలిని చూస్తూ కూడా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలోనే ఉండిపోతాం.శ రాజధాని ఢిల్లీని వాయుకాలుష్యం ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. మరోవైపు ప్రపంచానికే పొగమంచు రాజధానిగా పేరుపొందిన చైనా రాజధాని బీజింగ్ గడచిన దశాబ్ద కాలంలో వాయు నాణ్యతను గణనీయ స్థాయిలో మెరుగుపరుచుకుంది. గడచిన వారం రోజులుగా ఢిల్లీలో వాయు నాణ్యత దారుణంగా పడిపోయిన నేపథ్యంలో ఈ గండం నుంచి గట్టెక్కడానికి చైనీస్ ఎంబసీ ప్రభుత్వానికి కొన్ని సూచనలు చేసింది. పట్టణీకరణ వేగంగా పెరుగుతున్న దరిమిలా ఉత్పన్నమయ్యే వాయు కాలుష్యంపైన ఎలా పోరాడాలో భారత్, చైనాకు తెలుసునని చైనీస్ ఎంబసీ అధికార ప్రతినిధి యూ జింగ్ తన పోస్టులో పేర్కొన్నారు. స్వచ్ఛమైన గాలి రాత్రికి రాత్రే రాదని, కాని దాన్ని సాధించగలమని ఆమె తెలిపారు. డిసెంబర్ 15న ఢిల్లీలో వాయు ప్రమాణ సూచి(ఏక్యూ) 447 ఉండగా బీజింగ్‌లో 67 పాయింట్లు ఉంది. ఈ రెండు స్క్రీన్‌షాట్లను ఆమె తన పోస్టులో షేర్ చేశారు.మొదటి దశలో వాహన కాలుష్యాన్ని అరికట్టేందుకు బీజింగ్ తీసుకున్న చర్యలను ఆమె వివరిస్తూ ఎక్కువ కాలుష్యాన్ని వెదజల్లే పాత వాహనాలను తొలగించి యూరో 6 నిబంధనలను కఠినంగా అమలు చేసినట్లు ఆమె చెప్పారు. లైసెన్స్-ప్లేట్ లాటరీలు, బేసి, సరి సంఖ్య తేదీల్లో వాహనాలపై ఆంక్షలు, మెట్రో, ప్రజారవాణా వ్యవస్థలో భారీ పెట్టుబడులు పెట్టడం, విద్యుత్తు బస్సులు, వాహనాల వినియోగాన్ని పెద్ద ఎత్తున తీసుకురావడం వంటి చర్యలను ఆమె సూచించారు.రెండవ దశలో పారిశ్రామిక పునర్వ్యవస్థీకరణపై దృష్టి సారించాలని ఆమె తెలిపారు. బీజింగ్‌లో 3,000కు పైగా భారీ పరిశ్రమల మూసివేత లేక వేరే ప్రాంతాలకు తరలింపు జరిగినట్లు చెప్పారు. చైనాలోని అతి పెద్ద ఉక్కు తయారీ సంస్థల్లో ఒకటైన షౌగాంగ్‌ని వేరే చోటుకు తరలించడంతో 20 శాతం వాయు కాలుష్యం తగ్గినట్లు వివరించారు. ఖాళీ చేసిన ఫ్యాక్టరీల స్థలాలను పార్కులు, వాణిజ్య జోన్లు, టెక్ హబ్‌లుగా మార్చాలని ఆమె సూచించారు.



# అసెంబ్లీలో రప్ఫా..రఫ్ఫా రాజకీయం

**నెల్లూరు– సూర్య వాస్తవం**



అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ఫిబ్రవరిలో జరగనున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటుతోంది. ప్రతిపక్ష హోదా ఇవ్వనిదే సభకు హాజరు కామని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేసింది. ఇప్పటికీ అదే స్టాండ్‌తో ఉంది. మరోవైపు వరుసగా పని దినాలు కలుపుకొని శాసనసభకు 60 రోజులపాటు హాజరు కాకుంటే ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ వేటు పడే అవకాశం ఉంది. ఇప్పటికే శాసనసభ ఎథిక్స్ కమిటీ సమావేశం జరిగింది. వైసీపీ ఎమ్మెల్యేల గైర్హాజరుపై చర్చించారు. ప్రభుత్వానికి నివేదించనున్నారు. స్పీకర్ ద్వారా మరోసారి నోటీసులు జారీ చేసే అవకాశం ఉంది. సాధారణంగా అసెంబ్లీ శీతాకాల సమావేశాలు నవంబర్ నుంచి జనవరి మధ్య జరగాలి. కానీ ఈసారి ఆలస్యం జరిగింది. ఫిబ్రవరిలో సమావేశాలు ఉంటాయని తెలుస్తోంది.

దాదాపు పది రోజులపాటు సభను కొనసాగించాలని స్పీకర్ నిర్ణయించినట్లు సమాచారం. అయితే ఈసారి కూటమి ప్రభుత్వం శాసనసభ సమావేశాల్లో వ్యూహాత్మకంగా వ్యవహరించ నున్నట్లు తెలుస్తోంది. గడిచిన ఏడాదిన్నర కాలంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు గురించి సమగ్రంగా వివరించనున్నారు ఈ సభ ద్వారా. అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్ట్, విశాఖలో పరిశ్రమల ఏర్పాటు, ఏపీకి భారీగా వస్తున్న ప్రాజెక్టులు, తయారీ రంగం పరిశ్రమలు.. ఇలా ప్రతి అంశం గురించి సమగ్రంగా చర్చించే వీలుగా సభలు ఉండను న్నాయి. అర్థవంతమైన చర్చకు తెర లేపనున్నారు. ముఖ్యంగా విపక్ష పాత్రను కూడా అధికార పార్టీ ఎమ్మెల్యేలు పోషించనున్నారు. ప్రజల తరపున బలమైన వాయిస్ వినిపించి ప్రభుత్వం నుంచి సమాధానాలు రాబట్టను న్నారు. అందుకే లోతైన అధ్యయనం చేయా లని పార్టీ ఎమ్మెల్యేలకు చంద్రబాబు సూచించారు. మంత్రులు కూడా సమగ్ర వివరాలతో సభకు హాజరు కావాలని ఇప్పటికే సంకేతాలు పంపించారు. ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చిన నాటికి రాష్ట్ర పరిస్థితి ఎలా ఉంది? ఇప్పుడు ఎలా ఉంది అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ఇచ్చే అవకాశం ఉంది. ఎందుకంటే ఇటీవల పెట్టుబడులను ఆకర్షించడంలో ఏపీ దేశంలోనే ప్రథమ స్థాయిలో నిలిచింది. దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్రాలకు వచ్చిన పెట్టుబడుల ప్రతిపాదనల్లో.. 25శాతం ఏపీకి రావడం నిజంగా శుభపరిణామం. ఇందులో సగం పెట్టుబడులు వచ్చిన ఏపీ అభివృద్ధి సాధించినట్టే. మరోవైపు కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా ఉంది. కూటమి ప్రభుత్వం చెప్పినట్టే ఒకవైపు అభివృద్ధి.. మరోవైపు సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ అడుగులు వేస్తోంది. అమరావతి రాజధానితో పాటు పోలవరం ప్రాజెక్ట్ వంటి ప్రాధాన్య తాంశాలను పూర్తిచేసేందుకు గట్టి ప్రయత్నాల్లోనే ఉంది. మొన్ననే భోగాపురం అంతర్జాతీయ విమానా శ్రయం ట్రయల్ రన్ పూర్తి చేసుకుంది. అయితే వైసీపీ నుంచి మాత్రం అంతా తామే చేసాం అన్నట్టు వాయిస్ వస్తోంది. అందుకే దాదాపు పది రోజులపాటు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించి.. ప్రజలకు వాస్తవాలు తెలియజేసేందుకు ప్రభుత్వం సిద్ధపడుతోంది.

# వారసుడు ట్యాగ్ ? ఇప్పుడు లీడర్ ముద్ర

**విజయవాడ – సూర్య వాస్తవం**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక పునర్నిర్మాణానికి స్పష్టమైన దిశానిర్దేశం ఇస్తూ ముందుకు సాగుతున్న ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్ జాతీయ స్థాయిలో మరోసారి గుర్తింపు పొందారు. ప్రముఖ జాతీయ వారపత్రిక 'ది వీక్' మ్యాగజైన్ కవర్ పేజీపై ఆయన నిలవడం ఇప్పుడు రాజకీయ, ఆర్థిక వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలో పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాల సృష్టిని లక్ష్యంగా చేసుకుని పని చేస్తున్న లోకేష్‌ను 'చీఫ్ జాబ్ క్రియేటర్'గా ఆ మ్యాగజైన్ అభివర్ణించడం విశేషం.నారా లోకేష్ విద్యా నేపథ్యం, అంతర్జాతీయ అనుభవం ఆయన పనితీరులో స్పష్టంగా కనిపిస్తోందని 'ది వీక్' పేర్కొంది. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ, కార్నెగీ మెలన్ యూనివర్సిటీ వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థల్లో విద్యాభ్యాసం చేసిన లోకేష్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనలను వేగంగా అమలు చేసే నాయకుడిగా ఎదిగారని మ్యాగజైన్ విశ్లేషించింది. పరిశ్రమలతో నేరుగా మాట్లాడటం, విధానాల్లో మార్పులు తీసుకురావటం, పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పించడం ద్వారా రాష్ట్రాన్ని ఇన్వెస్టర్లకు ఆకర్షణీయంగా మార్చుతున్నారని తెలిపింది.ఇది తొలిసారి కాదు. గతంలో ప్రముఖ ఆర్థిక పత్రిక 'బిజినెస్ స్టాండర్డ్'కూడా నారా లోకేష్‌ను 'జాబ్ క్రియేటర్ ఇన్ చీఫ్'గా పేర్కొంది. ముఖ్యంగా ఏపీ ప్రభుత్వం? రిలయన్స్ ఇండస్ట్రీస్ మధ్య కుదిరిన ఒప్పందం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. కేవలం 30 రోజుల్లోనే రూ.65 వేల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రావడం వెనుక లోకేష్ కీలక పాత్ర ఉందని ఆ పత్రిక పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆయనతో ప్రత్యేక ఇంటర్వ్యూ కూడా నిర్వహించింది.ఉద్యోగాల కల్పన సబ్ కమిటీ చైర్మన్‌గా లోకేష్ బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్రంలో పెట్టుబడులపై ప్రత్యేక దృష్టి పెట్టారని జాతీయ మీడియా చెబుతోంది. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పరిశ్రమల విస్తరణ, కొత్త ప్రాజెక్టుల ఆమోదం, ఐటీ రంగాన్ని బలోపేతం చేయడం వంటి చర్యలు వేగంగా సాగుతున్నాయని విశ్లేషిస్తోంది. ముఖ్యంగా పెట్టుబడిదారులకు క్లియర్ పాలసీలు, వేగవంతమైన అనుమతులు ఇవ్వడం వల్ల ఆంధ్రప్రదేశ్ మళ్లీ అభివృద్ధి పథంలోకి వస్తోందని వ్యాఖ్యానిస్తోంది. మొత్తానికి, నారా లోకేష్ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా తిరిగి నిలదొక్కుకునే దిశగా ముందుకెళ్తోందని జాతీయ మీడియా స్పష్టంగా చెబుతోంది. పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాలే కేంద్రబిందువుగా రాష్ట్ర భవిష్యత్తు రూపుదిద్దుకుంటోందన్న అభిప్రాయం మరింత బలపడుతోంది. నారా లోకేష్‌ను నాలుగైదేళ్ల కిందట వారసుడిగా మాత్రమే చూసేవాళ్లు. కానీ తనకంటూ ఒక ప్రత్యేకమైన ముద్ర వేసుకున్న సమర్థవంతమైన నాయ కుడిగా ఎదుగుతున్నారు. ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొద్ది కాలంలోనే, వ్యవస్థలో ఆయన తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులు సంచలనం సృష్టిస్తున్నాయి. అటు ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో, ఇటు విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించ డంలో ఆయన చూపిస్తున్న చొరవతో సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. లోకేష్ పనితీరు కేవలం రాష్ట్ర స్థాయిలోనే కాకుండా, జాతీయ స్థాయిలో కూడా గుర్తింపు పొందుతోంది. ముఖ్యంగా 'యోగాంధ్ర' వంటి వినూత్న కార్యక్రమాల నిర్వహణ ద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృష్టిని ఆకర్షించడమే కాకుండా, ఆయన అభిమానాన్ని కూడా చూరగొన్నారు. యువ నాయకత్వంలో లోకేష్ చూపిస్తున్న పరిణతి, అంకితభావంపై ప్రధానికి ఎంతో నమ్మకం ఏర్పడటం విశేషం. ఇది ఆయన రాజకీయ భవిష్యత్తుకు ఒక బలమైన పునాదిగా మారుతోంది. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడంలో లోకేష్ ఒక ఇండస్ట్రియల్ హీరో గా అవతరించారు. అంతర్జాతీయ కంపెనీలను ఏపీ వైపు మళ్లించడంలో ఆయన అనుసరిస్తున్న వ్యూహాలు భారతీయ పారిశ్రామిక రంగాన్ని అబ్బురపరుస్తున్నాయి. తాజాగా ప్రముఖ ది వీక్ మ్యాగజైన్ కవర్ పేజీపై ఆయనను ప్రదర్శించడం, ఆయన పెరుగుతున్న ప్రాభవానికి నిదర్శనం. పెట్టుబడుల విషయంలో ఆయన చూపిస్తున్న వేగం చూస్తుంటే, రాబోయే రోజుల్లో ఏపీ పారిశ్రామిక హబ్‌గా మారడం ఖాయమనిపిస్తోంది.లోకేష్ ప్రభావం కేవలం ఆంధ్రప్రదేశ్‌కే పరిమితం కాలేదు. బీహార్ వంటి ఇతర రాష్ట్రాల ఎన్నికల ప్రచారానికి వెళ్లినప్పుడు అక్కడ ఆయనకు లభించిన ఆదరణ అసాధారణం. అక్కడి యువత లోకేష్‌ను ఒక రోల్ మోడల్‌గా భావించి బ్రహ్మరథం పట్టడం చూస్తుంటే, ఆయన జాతీయ స్థాయిలో ఎదగగల సత్తా ఉన్న నాయకుడని స్పష్టమవుతోంది. క్షేత్రస్థాయి సమస్యలపై అవగాహన, ఆధునిక సాంకేతికతపై పట్టు ఉన్న లోకేష్, నిశ్చయంగా దేశ రాజకీయాల్లో ఒక వెలుగు వెలిగే భవిష్యత్ నాయకుడు అని ఎక్కువ మంది అంచనా వేస్తున్నారు.

# ఏపీలో కారవాన్ టూరిజం ప్రారంభం..

## - ఎంచక్కా 4 మార్గాల్లో ప్రయాణం

**విజయవాడ – సూర్య వాస్తవం**



ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా కారవాన్ టూరిజం ప్రారంభమైంది. ఏపీటీడీసీ పోర్టల్ ద్వారా వీటిని బుక్ చేసుకుని టీవీ, ఫ్రిజ్, వాష్‌రూమ్ వంటి సదుపాయాలతో ప్రయాణించవచ్చు. మీకు కారవాన్ అనగానే సెలబ్రిటీలు, ముఖ్యంగా సినీ ప్రముఖులు గుర్తుకొస్తారు. ఇప్పుడు ఏపీ ప్రభుత్వం పర్యారక రంగానికి ఊతమిచ్చేందుకు కారవాన్ టూరిజాన్ని తీసుకొచ్చింది. రాష్ట్రంలో పర్యాటకులకు సరికొత్త అనుభూతిని అందించేందుకు కూటమి ప్రభుత్వం మొదటిసారిగా కారవాన్ వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, గోవాల వంటి రాష్ట్రాల తరహాలోనే ఏపీలో కూడా పర్యాటకాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వం ప్రత్యేక విధానాన్ని రూపొందించింది. ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ ఓజీ డ్రీమ్ లైనర్స్, ఇండియా లక్సీ కారవాన్ ఒఒఖ అనే రెండు సంస్థలను ఎంప్యానల్ చేసింది. ప్రస్తుతం ఈ సంస్థలు 5, 6 సీట్లు, 10-12 సీట్ల సామర్థ్యం కలిగిన నాలుగు వాహనాలను నాలుగు ప్రధాన మార్గాల్లో నడుపుతున్నాయి. ఆసక్తి గల పర్యాటకులు వీటిని నేరుగా ఏపీటీడీసీ పోర్టల్ ద్వారా బుక్ చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది.సంక్రాంతి పండుగను పురస్కరించుకుని హైదరాబాద్ నుండి భీమవరం, దిండి వరకు ప్రత్యేకంగా 6 రోజుల ప్యాకేజీని ప్రకటించారు. ఈ ప్యాకేజీ ధర రూ.3.50 లక్షలుగా నిర్ణయించారు. జనవరి 10, 11, 12 తేదీల్లో బుకింగ్ చేసుకున్న వారికి ఆ రోజు నుండి ఆరు రోజుల పాటు ఈ ప్రయాణం సాగుతుంది. పండుగ సెలవుల్లో వినూత్నంగా ప్రయాణించాలనుకునే పర్యాటకుల కోసం హైదరాబాద్ నుండి 4 కారవాన్ వాహనాలు అందుబాటులో ఉంచారు. ఈ కారవాన్ టూరిజంలో భాగంగా పర్యాటకుల సౌకర్యార్థం సకల వసతులు కల్పించారు. పగటిపూట పర్యాటక ప్రాంతాలను సందర్శించి, రాత్రి వేళల్లో కారవాన్‌లోనే నిద్రించేలా సీట్లను పడకలుగా మార్చుకునే వీలుంటుంది. వీటిలో టీవీ, ఫ్రిజ్, వాష్‌రూమ్ వంటి సదుపాయాలు కూడా ఉన్నాయి. భోజనం కోసం పర్యాటకుల కోరిక మేరకు నచ్చిన హోటళ్ల వద్ద వాహనాన్ని ఆపుతారు. అయితే భోజన ఖర్చులు ప్రయాణికులే భరించాల్సి ఉంటుంది. భద్రత దృష్ట్యా రాత్రి సమయాల్లో ఈ వాహనాలను పర్యాటక శాఖ హోటళ్లు లేదా ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్ల ప్రాంగణాల్లో పార్కింగ్ చేస్తారని తెలిపారు.

## ఘనంగా ప్రారంభం అయిన షెట్టిల్ టోర్నమెంట్



**బ్రహ్మంగారిమఠం - సూర్య వాస్తవం:** బ్రహ్మంగారి మఠం నందు సంక్రాంతి పండుగ సందర్భంగా స్థానిక ఆర్‌సిఎం గ్రౌండ్‌లో మండల స్థాయి షటిల్ టోర్నమెంట్‌ను టిడిపి మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బా రెడ్డి, ఎస్సార్ శ్రీనివాసుల రెడ్డి, యల్లటూరు సాంబ శివ రెడ్డి, ముడుమాల పోలి రెడ్డి, పూజ శివ యాదవ్‌లు ప్రారంభించారు. ఈ పోటీలకు తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా కానాల మల్లికార్జున రెడ్డి స్పాన్సర్‌గా ఉంటూ విజేతలకు మొదటి బహుమతిగా రూ.10016లు అలాగే రెండవ బహుమతిగా రూ.5016లు అందజేయనున్నారు. ట్రోఫీలు స్పాన్సర్ లు సాంబశివరెడ్డి, పూజా శివయ్య యాదవ్. ఈ పోటీలు ఐదు రోజుల పాటు జరగనున్నాయి. ఈ కార్యక్రమం లో మండల టీడీపీ నాయకులు మేకల సుధాకర్, చాపాటి సురేష్ , గంగిరెడ్డి పల్లె సూరి, నాగయ్య తో పాటు ఆర్గనైజర్లు సోమా అమర్నాథ్ రెడ్డి, కల్లూరి భాష, క్రీడాకారులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కూటమి ప్రభుత్వ ధ్యేయం



**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం :** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కూటమి ప్రభుత్వ ధ్యేయమని మంత్రి సోదరుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం దిన్నెపాడు పంచాయతీలోని డి.వడ్డేపల్లి లో 12 లక్షలతో సిమెంట్ రోడ్డుకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల తరబడి త్రాగునీటితో ఇబ్బంది పడుతున్న డి.వడ్డేపల్లి, బి.ఎర్రగుడి, పందిళ్ళపల్లి గ్రామాలకు త్రాగునీరు అందించామన్నారు. అంతే కాకుండా జల్జీవన్ మిషన్ ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్లు అందించే దిశలో ఉందన్నారు. ఇప్పటికే లక్కిరెడ్డిపల్లి మండలంలో మూడు కోట్ల రూపాయలతో సిమెంట్ రోడ్లు తారు రోడ్లు వేయించామన్నారు. అనంతరం నరసింహారాజు గారి పల్లెలో శ్రీ దేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవంలో ఆయన పాల్గొని పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు యనమల మదనమోహన్, మార్కెట్ కమిటీ చైర్మెన్ షఫీ నాయక్, సింగిల్ విండో అధ్యక్షుడు లక్ష్మి రాజు, క్లాస్ వన్ కాంట్రాక్టర్ యాగంటి పాపయ్య, సర్పంచ్ లక్ష్మీనారాయణ, చెరువు కమిటీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు ధర్మరాజు, టిడిపి రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి శంకారపు జయరాం, అచ్చిరాజు, జనార్ధన్ రాజు, అశోక్ రాజు, శ్రీకాంత్ రాజు, నరసరాజు, నాగరాజు, టిడిపి మండల తెలుగు యువత అధ్యక్షుడు పకీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి రైతు రాజముద్ర కలిగిన పట్టాదారు పాసు పుస్తకం పొందాలి



**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం :** ప్రతి రైతు రాజముద్ర కలిగిన పట్టాదారు పాసుపుస్తకం పొందాలని అన్నమయ్య జిల్లా జెసి ఆదర్శ రాజేంద్రన్ పేర్కొన్నారు. శనివారం పందిళ్ళపల్లి గ్రామంలో పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరై రైతులతో మాట్లాడారు. పాస్ పుస్తకాలలో సర్వే నెంబర్లు ఆధార్ నెంబర్లు పట్టా కలిగిన రైతు పేరు కచ్చితంగా పాస్ పుస్తకంలో ముద్రించాయా లేదా అన్న విషయాన్ని గుర్తించాలన్నారు. అలా ఏదైనా పాస్ పుస్తకంలో తప్పులు ఉంటే స్థానిక తహసిల్దార్ దృష్టికి తీసుకుని వస్తే మార్పులను సవరిస్తారన్నారు. మండల వ్యాప్తంగా ఈ నెల 2వ తేదీ నుంచి 10వ తేదీ వరకు 3617 పాస్ పుస్తకాలకు గాను 3049 పాసుపుస్తకాలు రైతులకు అందజేసినట్లు తహసిల్దార్ క్రాంతికుమార్ జెసికి తెలిపారు. ఇక 568 పాస్ పుస్తకాలు రైతులు అందుబాటులో లేక పంపిణీ చేయలేదని వాటిని కూడా తొందరగా పంపిణీ చేస్తామని జెసికి తెలిపారు. పట్టాదారు కలిగిన ప్రతి రైతుకు పాసు పుస్తకం కచ్చితంగా అందించాలని రెవెన్యూ సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజేష్ విఆర్వోలు గ్రామ నాయకులు రైతులు పాల్గొన్నారు.

## నూతన హ్యూమన్ రైట్స్ ఎస్సీ సెల్ నియామకం



**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి పట్టణానికి నూతనంగా ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ క మిషన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నాగ దని భరత్ ని జాతీయ అధ్యక్షులు హెచ్ఎండి ముజాహిద్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎస్సీ వర్గాల హక్కుల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. అణగారిన వర్గాలపై జరుగుతున్న అన్యా యాలు, అక్రమాలు, హక్కుల ఉల్లం ఘనలపై తక్షణమే స్పందిస్తూ బాధితులకు న్యాయం చేకూరేలా చర్యలు తీసుకుంటానని భరత్ పేర్కొన్నారు. గుత్తి పట్టణంలో హ్యూమ న్ రైట్స్ ఎస్సీ సెల్ ను మరింత బలో పేతం చేసి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ నియామకంపై స్థానిక నాయ కులు,కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ భరత్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# గండికోట ఉత్సవాలు జయప్రదం చేద్దాం

### - మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్




**పులివెందుల - సూర్య వాస్తవం**

గండికోట ఉస్తవాల సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశాను సారం శనివారం ఉదయం పులివెందులలోని పాత ఆర్టీసీ బస్టాండ్ సమీపం వద్ద ఉన్న అంబేద్కర్ సర్కిల్ నుండి పూల అంగళ్ల సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా చైర్మన్ వరప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 11, 12, 13 తేదీలలో మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా, కన్నుల పండుగగా ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని, మన గత చరితక వైభవాన్ని, సంస్కృతి సంప్రదాయాలకు దర్పణం పట్టే.. గండికోట ఉత్సవాలు -2026 లకు ప్రతి ఒక్కరూ కుటుంబ సమేతంగా, బంధు మిత్రులతో తరలి రావాలని ప్రజలందరూ ఈ గండికోట ఉస్తవాల యందు పాల్గొని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ డా వి వర ప్రసాద్ పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పార్నపల్లి కిషోర్, మున్సిపల్ ఇంచార్జి కమిషనర్ సురేష్ బాబు,రెవెన్యూ అధికారి ముని కుమార్,మున్సిపల్ సిబ్బంది,సచివాలయం సిబ్బంది, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**విరాళాల కోసం పిలుపు**

మూడు దశాబ్దాలుగా నిశ్శబ్దంగా సేవల దీపం వెలిగిస్తూ సమాజానికి అండగా నిలుస్తున్న స్నేహిత అమృత హస్తం సేవాసమితికి ఇప్పుడు మీ చేయూత అవసరం. అనాధలు, అభాగ్యులు, ఆపన్నహస్తం కోరుకునే వారిని ఆదుకుంటూ సాగుతున్న ఈ సేవా ప్రయాణం నిరంతరం కొనసాగాలంటే, శాశ్వత సేవా కేంద్రంగా నిలిచే నూతన భవన సముదాయం అత్యవసరమైంది. ఇప్పటికే కొంతమంది దాతల సహకారంతో భవనం 50 శాతం వరకు పూర్తయింది.కానీ మిగిలిన నిర్మాణం పూర్తవ్వాలంటే ఇంకా మరిన్ని మంచి మనసులు ముందుకు రావాల్సి ఉంది. ఇది ఇటుకలు, సిమెంటుతో కట్టే భవనం మాత్రమే కాదు. ఇది ఆశకు చిరునామా, సేవకు నిలయం, మానవత్వానికి సాక్ష్యం.మీ విరాళం చిన్నదైనా సరే, ఆ సహాయం పెద్ద జీవితానికి ఆశనిస్తుంది. మీ చేయూతతో ఒక సేవా స్వప్నం సాకారం అవుతుంది. రండి స్నేహిత అమృత హస్తం సేవాసమితి భవన నిర్మాణంలో భాగస్వాములు అవుదాం. సేవా దీపాన్ని తరతరాలకు వెలిగిద్దాం.

Account Details:-
SNEHITHA AMRUTHA HASTHAM SEVA SAMITHI
A/C NO.31055459607
IFSC SBIN0000989
PULIVENDULA MAIN BRANCH
Contract No.9966509364, 9866727534.

# భయభ్రాంతులకు గురి చేయడం తగదు



**ఓబుళవారిపల్లి - సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లి మండలం, పెద్ద ఓరంపాడు పంచాయతీ దేవరపల్లిలో లక్ష్మీదేవి అనే మహిళ తన సొంత స్థలంలో చర్చి కట్టుకుంటుంటే, కొంతమంది ఆర్ఎస్ఎస్, బజరంగదళ్, హిందూ పరిషత్, అంటూ కొందరు వచ్చి, చర్చి, కట్టడానికి మీకు పర్మిషన్ ఉందా అని లక్ష్మీ దేవిని పనులు చేయించుండగా, ఆపివేసి మేము జెసిబి తో తెచ్చి, కూల్చివేస్తామని భయభ్రాంతులకు గురి చేశారని కాంగ్రెస్ నాయకులు శాంతయ్య తెలిపారు. ఈ విషయం క్రైస్తవ మత పెద్దలకు విషయము తెలపగా, వెంటనే స్పందించి, సి,జె,ఏసి, రాష్ట్ర అధ్యక్షులు, బిస్సప్ మోసెస్, నెల్లూరు జిల్లా, సిజెఎసి, అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, కడప జిల్లా జే,ఎ,సీ, అధ్యక్షులు, జి డానియల్ పాపయ్య, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ నల్ల కదిరిగాళ్ళ శాంతయ్య, లు వచ్చి విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రములో క్రైస్తవుల పైన చర్చిల పైన, దాడులు ఎక్కువైనాయని, భారతదేశంలో అన్ని మతాలు కలసి ఉంటేనే సుఖంగా ఉంటాదని, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, రాజ్యాంగం కల్పించిన హక్కులను కూడా బిజెపి ఆర్ఎస్ఎస్, హిందూ పరిషత్, కాలరాస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. భారతదేశంలో ఎవరి మతాన్ని వారు స్వేచ్ఛగా, ఆరాధించుకునే హక్కు, రాజ్యాంగం కల్పించిందని, ఈ దాడులు ఇంతటితో ఆపకపోతే, ఈ రాష్ట్రంలో ఉండే క్రైస్తవ మత గురువులు, అన్ని సంఘాల పాస్టర్లు, విశ్వాసులు, అందరూ కలిసికట్టుగా, ఏకమై, రాష్ట్రంలో క్రిస్టియన్ల పైన జరిగే దాడులను, అరికడతామని, రాబోయే 2029లో కూటమి ప్రభుత్వానికి, బుద్ధి చెబుతామని హెచ్చరించారు, ఈ కార్యక్రమంలో పుల్లంపేట మండల అధ్యక్షుడు సిగమాల రమేష్, రైల్వే కోడూరు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నాయకులు బాలమురళి, పాస్టర్లు, ఆర్ దేవకుమార్, వేణు, మరియు కొందరు పాస్టర్లు కలిసి, ఓబులవారిపల్లె, పోలీస్ స్టేషన్ ఎస్ఐకి, వినతి పత్రం అందజేశారు.

## ప్రసాద్ స్కూల్లో అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

### - ఆకట్టుకున్న చిన్నారుల బొమ్మల కొలువు

### - ఘనంగా విద్యార్థుల ముందస్తు సంక్రాంతి సంబురాలు

**అనంతపురం విద్య - సూర్య వాస్తవం :** నాటి సంస్కృతి, సాంప్రదాయాలు కనుమరుగు కాకుండా నేటి తరానికి తెలియజేయ వలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ప్రసాద్ పాఠశాల గురువులు, విద్యార్థులు చాటిచెప్పారు.సంక్రాంతి పండగ అంటేనే పచ్చని పంటలు రైతులు ప్రజలు సంతోషంగా జరుపుకునే సంక్రాంతి పండుగ,మన తెలుగు సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత, తెలుగు సాంప్రదాయానికి ప్రతీక సంక్రాంతి పండుగ అని ప్రసాద్ కాన్సెప్ట్ స్కూల్ ఛైర్మన్ ప్రసాద్ గుప్తా. నాగరాజు గుప్తా, గంగాధర్ గుప్తాలు తెలియజేశారు. శనివారం నగరంలోని రెండవ రోడ్డు ప్రసాద్ కాన్సెప్ట్ స్కూల్ ఆవరణంలో మందుస్తు సంక్రాంతి పండుగను పురస్కరించుకొని స్కూల్లో ఘనంగా సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థినీ విద్యార్థులు అంగరంగ వైభవంగా నృత్యా కార్యక్రమాలు నిర్వహించి చలిమంటలు కాచుకొని ఆనందోత్సవ నడుమ సంబరాలు నిర్వహించుకున్నారనీ వారు తెలియజేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజలు రైతులు సంతోషంగా ఉండాలని వారు ఆ ముక్కోటి దేవతలను కోరుకున్నారు. మన సాంస్కృతి సంప్రదాయాలు భావితరాలకు తెలిసేలా నృత్య కార్యక్రమాన్ని చేపట్టారు, సంక్రాంతి అంటే సంవత్సరానికి ఒక్కసారి వచ్చే పండుగ కాదని తెలుగు సంస్కృతి సాంప్రదాయాలు భవిష్య తరాలకు తెలిసే పండుగని వారు తెలిపారు, ముగ్గుల పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థ ఉపాధ్యాయ బృందం, సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## రాయచోటిని ప్రత్యేక జిల్లాగా ప్రకటించాలి

### - 4వ రోజుకు చేరుకున్న నిరాహార దీక్షలు

### - మద్దతు తెలిపిన రాయచోటి నియోజక వర్గ కళాకారులు



**రాయచోటి - సూర్య వాస్తవం:** రాయచోటిని ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శనివారం రాయచోటిలోని కాలేజీ గ్రౌండ్ లో నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలకు రాయచోటి నియోజకవర్గం లోని అన్ని మండలాలకు సంబంధించిన సకల కళాకారులు మద్దతు తెలుపుతూ దీక్షలో కూర్చున్నారు. బంగ్లా ఎదురుగా కాలేజీ గ్రౌండ్లో ఈ సందర్భంగా దీక్ష లో అన్నమయ్య జిల్లా డిసిసి అధ్యక్షులు గాజుల భాస్కర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల సందర్భంగా రాయచోటి జిల్లా కేంద్రంగా కొనసాగిస్తామని హామీని ఇచ్చి మరచి రాయచోటి జిల్లా కేంద్రాన్ని మదనపల్లెకు మార్చడం బాధాకరమన్నారు. పోలవరం అతి చిన్న నియోజకవర్గశీ జిల్లా కేంద్రం చేసినప్పుడు, పాత చిత్తూరు జిల్లాను మూడు జిల్లాలుగా ప్రకటించిన నప్పుడు రాయచోటి చుట్టూ 14 మండలాలను కలుపుకొని రాయచోటిని జిల్లాగా ఎందుకు ప్రకటించకూడదని ఆయన ప్రశ్నించారు. రాయచోటి ప్రజలకు అన్యాయం చేయడం ఎంతవరకు సమంజసమని ఆన్నారు. వెంటనే దీనిపై పరిశీలించి జిల్లా కేంద్రంగా చేయాలని విజ్ఞప్తి చేస్తున్నమన్నారు. సామూహిక నిరాహార దీక్షలో భాగంగా రాయచోటి నియోజకవర్గం లోని కళాకారులు తమ మద్దతును ప్రకట్టించడం ఆనందదాయకం అన్నారు. నటుడు, చిత్రకారుడు, రంగస్థల దర్శకుడు అభినయ్ , రంగస్థల కళాకారుడు తుమ్మలహరినాథ్,కళాకారుడు హరిదాసు రామచంద్ర, అన్నమయ్య సకల కళాకారుల అధ్యక్షులు నాగయ్య,రిటైర్డ్ టీచర్ భాస్కర్ రెడ్డి, హార్మోనిస్ట్ పార్థసారథి (స్వామి) సురేష్ బాబు, భజన గురువులు, కళాకారులు జయరాం,( శీరాములు,సురేంద్ర, వెంకటస్వామి, ఆంజనేయులు, రామాంజులు డిసిసి చీఫ్ సెక్రటరీ అమీర్ భాష,డిసిసి అధికార ప్రతినిధి మన్సూర్ అలీ ఖాన్,రాయచోటి పట్టణ అధ్యక్షులు బాబా సర్దార్, జిల్లా కిసాన్ సెల్ ప్రెసిడెంట్ సురేంద్ర రెడ్డి తదితరులు దీక్షలో పాల్గొన్నారు.

## పండుగలా... వేమన జయంత్యుత్సవాలు

### - రాష్ట్రం నలుమూలల నుంచి తరలిరావాలని ఆహ్వానం
### - జయంతి ఉత్సవాల లోగోను ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు
### - ఎమ్మెల్యే 'కందికుంట'కు సీఎం అభినందనలు



**శ్రీ సత్యసాయి బ్యూరో – సూర్య వాస్తవం :** మానవీయ విలువలను తన పద్యాల ద్వారా ప్రపంచానికి చాటి చెప్పిన ఆధ్యాత్మిక, సంఘసంస్కర్త, ప్రజా కవి వేమన జయంత్యుత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 19వ తేదీన అత్యంత వైభవంగా నిర్వహిస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. శనివారం ఉదయం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యా లయంలోని తన ఛాంబర్ లో వేమన రాష్ట్రస్థాయి జయంత్యుత్సవాల లోగోను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ సత్య సాయి జిల్లా కదిరి నియోజకవర్గం కటారుపల్లి వేమన సమాధి వద్ద జరిగే ఈ ఉత్సవాలు ప్రజల ఆలోచనా విధానంలో గొప్ప మార్పు తీసుకొస్తాయన్నారు. కదిరి చరిత్రలో గుర్తుండిపోయేలా పండుగలా ఉత్సవాలను నిర్వహించా లని అధికారులను ఆదేశించారు. కదిరి ఎమ్మెల్యే కందికుంట వేంకటప్రసాద్ మాట్లాడుతూ వేమన కుల, మతాలకు అతీతంగా మనుషుల ప్రవర్తనలో మార్పు తీసుకువచ్చేందుకు పద్య ప్రక్రియను ఆయుధంగా ప్రయోగించారన్నారు. అతిరథ మహారథులైన విద్య, కళా, రాజకీయ, సామాజిక, సాహితీ రంగాల మేధావులు వేమన ఉత్సవాలకు హాజరవుతున్నారని, రాష్ట్రం నలుమూలల నుంచి అన్ని వర్గాల ప్రజలు, ప్రతినిధులు వేల సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. లోగో ఆవి ష్కరణ కార్యక్రమంలో సాహితీ పరిశోధకుడు డాక్టర్ ఉద్దండం చంద్రశేఖర్, గాయకుడు ము దిగుబ్బ (సుధాకర్ ఈటీవీ పాడుతా తీయగా ఫేమ్), ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడు పట్నం రమణ, ఏఐ డెవలపర్ తేజస్విని, ఫ్రంట్ ఎండ్ డెవలపర్ గౌతమి పాల్గొన్నారు.

## అధిక ధరలకు సిగరెట్లు విక్రయం

### - కనేకల్లులో రూ.10 వేల జరిమానా

**కనేకల్ – సూర్య వాస్తవం:** కనేకల్లు పట్టణంలో అధిక ధరకు సిగరెట్ ప్యాక్‌ను విక్రయించిన వ్యక్తిపై లీగల్ మెట్రోలజీ చట్టం ప్రకారం అధికారులు శనివారము కేసు నమోదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు సిగరెట్లు అమ్మినందుకు సంబంధిత వ్యక్తి నుంచిరూ.10,000 అపరాధ రుసుమును ఆన్‌లైన్ ద్వారా వసూలు చేసినట్లు లీగల్ మెట్రోలజీ ఇన్స్పెక్టర్ వై.జి. శంకర్ వెల్లడించారు.ఇలాంటి అక్రమాలకు పాల్పడే వ్యాపారులపై ఇకపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని లీగల్



మెట్రోలజీ ఇన్‌స్పెక్టర్ వై.జి.శంకర్ హెచ్చరించారు. వినియోగదారుల హితాన్ని దృష్టిలో ఉంచుకొని తనిఖీలు కొనసాగుతాయని అధికారులు పేర్కొన్నారు.

## పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమాలను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్



**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం:** అన్నమయ్య జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ శనివారం చిన్నమండెం మండలం మల్లూరు, వండాడి గ్రామాలు, లక్కిరెడ్డిపల్లి మండలం పందిళ్ళపల్లి గ్రామాలలో నిర్వహిస్తున్న పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా



సంయుక్త కలెక్టర్ సంబంధిత మండలాల తాసిల్దారులతో... పట్టాదారు పాసుపుస్తకాల గురించి లబ్ధిదారులకు వివరిస్తున్నారా లేదా ఇప్పటివరకు ఎన్ని పాసుపుస్తకాలు పంపిణీ చేశారు వంటి పలు ప్రశ్నలు అడిగి తగు సూచనలు చేశారు. లబ్ధిదారులకు క్యూఆర్ కోడ్ పై సమగ్ర సమాచారం అందించి దానిని వాడుకుని వారంతట వారు భూమిని గుర్తించేలా తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా సంయుక్త కలెక్టర్ లబ్ధిదారులతో మాట్లాడుతూ... పట్టాదారు పాస్ పుస్తకాలలో పొందుపరిచిన వివరాలు సరిగా ఉన్నాయా లేదా అని అడిగి ఏమైనా తప్పులుంటే, అర్జీ పెట్టుకొని పరిష్కరించుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత మండలాల తహశీల్దారులు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వామి వివేకానంద పాఠశాల రజతోత్సవం

### - పాల్గొన్న తులసి రెడ్డి, రాంభూపాల్ రెడ్డి



**వేంపల్లె – సూర్య వాస్తవం:** వేంపల్లిలో స్వామి వివేకానంద పాఠశాల 25వ వార్షికోత్సవం, స్వామి వివేకానంద 164వ జన్మదినోత్సవం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ రామాంజనేయరెడ్డి అధ్యక్షత వహించగా, రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ న రెడ్డి తులసి రెడ్డి, టిడిపి నాయకులు, రాయలసీమ పశ్చిమ నియోజకవర్గ పట్టబద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి,శ్రీనివాస పాఠశాల కర స్పాండెంట్ కేశవులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామి వివేకానంద భారతదేశపు ముద్దుబిడ్డని,ఆయన జీవించింది కేవలం 39 సంవత్సరాలు అయినప్పటికీ భారతదేశపు యువతకు,ప్రపంచ యువతకు స్ఫూర్తి ప్రధాత అయ్యారని అన్నారు. యువతా! లే.... మేలుకో....గమ్యం చేరుకొరకు విశ్రమించకు అని ఆయన ఇచ్చిన సందేశం యువత మీద తారక మంత్రంగా పనిచేసింది అన్నారు. అన్ని సంపదలలో కెల్లా విద్యాసంపద ప్రధానమైనదని, నైతిక విలువలతో కూడిన విద్యను ఆధునికతతో మేలవించి వివేకానంద పాఠశాల విద్యార్థులకు విద్యను అందించడం అభినందనీయమని అన్నారు. చదువులో, ఆటల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు బహుకరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి,తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి,ఐచర్ రమణ నామా వినయ్, టిడిపి నాయకులు రమణ తదితరులు పాల్గొన్నారు.




నారాయణరెడ్డి విద్యాసంస్థలో సంక్రాంతి సంబరాలలో పాల్గొన్న తులసి రెడ్డి, రామ్ గోపాల్ రెడ్డి

శనివారం వేంపల్లి లో నారాయణరెడ్డి విద్యాసంస్థలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ నారాయణరెడ్డి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నరెడ్డి తులసి రెడ్డి, టిడిపి నాయకులు, పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండుగలు మన సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిరూపాలని, మనుషుల మధ్య ఆప్యాయతలు, అనుబంధాలు పెంపొందింప చేయడంలో పండుగలు ప్రముఖ పాత్ర వహిస్తాయని అన్నారు. సంక్రాంతి పండుగ రైతుల పండుగ,పల్లెల పండుగ, అల్లుళ్ల పండుగ, ఆడపడుచుల పండగ అన్నారు. తెలుగువారి సంస్కృతి సంప్రదాయా లను కళ్ళకు కట్టినట్లుగా నారాయణ విద్యాసంస్థలు ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. ఈ కార్య క్రమంలో విద్యాసంస్థల ప్రిన్సిపల్ విజయ్ కుమార్, వ్యాఖ్యాత యాస్మిన్, సాంబశివరెడ్డి, టిడిపి నాయకులు రమణ, కాంగ్రెస్ నాయకులు తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, ఐచర్ రమణ, నామా వినయ్, విద్యార్థులు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## శ్రీ వృషభలేశ్వర స్వామి దేవస్థానంలో సంక్రాంతి సంబరాలు

### - దేవస్థాన చైర్మన్ పీవీ రమణ



**వేంపల్లె –సూర్య వాస్తవం,జనవరి 10 :** శ్రీ వృషభలేశ్వర స్వామి దేవస్థానం నందు సంక్రాంతి పండుగ సందర్భంగా శ్రీయుత ప్రాంతీయ సంయుక్త కమిషనర్, దేవాదాయ శాఖ తిరుపతి వారి ఆదేశాల మేరకు సంక్రాంతి సంబరాలు, సంస్కృతి సంప్రదాయంలో భాగంగా జనవరి 13వ తారీకున ముగ్గుల పోటీలు ఏర్పాటు చేయడం జరుగుతుందని పాలకమండలి చైర్మన్ పివి రమణ తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ వృషభలేశ్వర దేవస్థానం ప్రాంగణంలో సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు, జడలు అల్లుట, వివిధ ఆటల పోటీలు, హిందూ దేవుళ్ళు, దేవతల వేషధారణ పోటీలు నిర్వహించి చదురు పోటీల్లో గెలిచిన వారికి మొదటి బహుమతిగా 3000 వేల రూపాయలు రెండవ బహుమతిగా 2000 రూపాయలు మూడవ బహుమతిగా 1000 రూపాయలు బహుమతిగా పోటీల ముగిసిన తదుపరి సమావేశం ఏర్పాటు చేసి పోటీలో గెలిచిన వారికి దేవస్థానం పాలకమండలి చైర్మన్ స్థానిక పెద్దలు,వేద పండితులు, ప్రధానోపాధ్యాయుని ఉపాధ్యాయులు,మరియు ప్రోటోకాల్ ఉన్న వారి ఆహ్వానించి వారి సమక్షంలో బహుమతి ప్రధానం చేయబడునని తెలిపారు. అంతేకాకుండా ముగ్గుల పోటీల్లో పాల్గొనే వారు జనవరి 12వ తారీఖున సాయంత్రం 5 గంటలలోపు దేవస్థానం కార్యాలయం నందు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు, ముగ్గు వేయుటకు నిర్ణయించిన సమయం 30 నిమిషాలు మాత్రమే ముగ్గు పిండి దేవస్థానం వారి సమర్పించగలరని ముగ్గురు సరిపడ రంగులు పోటీలో పాల్గొనే వారే తెచ్చుకోవాలని తెలిపారు.

ఈ కార్యక్రమ ంలో కార్యనిర్వాహణాధికారి కే.సుభాష్, అర్చకులు హరి ప్రవీణ్ మరియు టీ.ఎస్ బాలుర, బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## పండుగలు ఐక్యతను పెంపొందిస్తాయి

**వేంపల్లె – సూర్య వాస్తవం :** పండుగలు ప్రజలను దగ్గర చేసే సందర్భాలు,ఐక్యత మరియు సోదర భావాన్ని పెంపొందిస్తాయని వేంపల్లెలోని తేజ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ మహాదేవరెడ్డి పేర్కొన్నారు. వేంపల్లెలోని తేజ స్కూల్ లో ముందస్తు సంక్రాంతి పండుగ సంబరాలు ఘనంగా నిర్వహించామ న్నారు. ఆయన మాట్లాడుతూ పండుగలు మన విభేదాలను పక్కనపెట్టి ఆనందాన్ని జరుపుకోవడానికి కలిసి రావడానికి అనుమతి స్తాయన్నారు. భారతదేశం ప్రతి సంవత్సరం ముప్పైకి పైగా



పండుగలను జరుపుకుంటుందన్నారు.సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా స్కూల్ ఆవరణలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా భోగి మంటలు,చిన్నారులకు భోగిపళ్ళు వేసి,గాలిపటాలను ఎగురవేశారు. అనంతరం ముగ్గుల పోటీలను నిర్వహించారు.విద్యార్థులు నిర్వహి ంచిన కోలాటాలు, డ్యాన్సులు ఎంతగానో ఆకట్టుకున్నాయి.మొదలగు సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ బి .మహాదేవరెడ్డి, హెచ్ ఎం . నాగేశ్వరమ్మ విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేసి అభినందించారు. ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## గజలక్ష్మి దేవిగా లక్ష్మీ వృషభాచలేశ్వరుడు

**వేంపల్లె – సూర్య వాస్తవం :** వేంపల్లెలోని శ్రీ లక్ష్మీ వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం అనుసంధానంలో గల శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో ధనుర్మాసం రెండవ శనివారం సందర్భంగా శ్రీ లక్ష్మీ వృషభాచలేశ్వర స్వామివారు గజలక్ష్మి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారని ఆలయ ఈఓ సుభాష్ తెలిపారు. ఈ సందర్భంగా దేవస్థానంలో ఆలయ ప్రధాన అర్చకులు హరిప్రవీణ్ నేతృత్వంలో శ్రీ లక్ష్మీ వృషభాచలేశ్వర స్వామి వారికి సూర్యోదయానికి ముందు ప్రాతఃకాల ఆరాధన,సహస్ర నామార్చన,ధూప దీప నైవేద్యం, నక్షత్ర హారతి,కుంభహారతి,రథ హారతి,శాత్తుమురై,మహామంగళహారతి తదితర విశేష పూజలు నిర్వహించామన్నారు.పూజల్లో భాగంగా భక్తుల సహకారంతో కర్నాటక నుండి తెప్పించిన గజమాలలతో, తామర పుష్పాలతో శ్రీ లక్ష్మీ వృషభాచలేశ్వర స్వామివారిని గజలక్ష్మి దేవిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పిం చామన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో స్వామివారికి తామర పుష్పాలతో మహిళలచే సామూహిక లక్షార్చన పూజా కార్యక్రమం నిర్వహించారు. భక్తులతో ఆలయ ప్రాంగణం శ్రీ లక్ష్మీ వృషభాచలేశ్వర స్వామి గోవింద నామస్మరణంతో మారుమ్రోగింది. ఆలయ పాలకమండలి ఛైర్మన్ వెంకటరమణ పర్యవేక్షణలో పూజా కార్య క్రమాలు కొనసాగాయన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.





# కేజీబీవీల్లో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్

**అనంతపురం విద్య – సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లాలోని కేజీబీవీల్లో ఖాళీల భర్తీకి సంబంధించి నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఈ మేరకు ఎస్.ఎస్.ఏ అదనపు ప్రాజెక్ట్ సమన్వయకర్త టి.శైలజ, జేసీడీఓ కవిత సంయుక్తంగా పత్రికలకు ఒక ప్రకటన శనివారం విడుదల చేశారు. కస్తూర్బా బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న భోదన, భోధనేతర సిబ్బంది పోస్టులను ఔట్ సోర్సింగ్ (పొరుగు సేవల ) ప్రాతిపదికన భర్తీ చేస్తున్నట్లు వివరించారు. ఈ పోస్టులకు కేవలం మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. ఆయా పోస్టులకు ఆసక్తి కలిగిన మహిళా అభ్యర్థుల నుంచి ఈ నెల 12 నుంచి 23వ తేదీ వరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు.

**జిల్లా వ్యాప్తంగా 72 ఖాళీలు**

జిల్లాలో టైపు-3, టైపు-4 కేజీబీవీలకు సంబంధించి 72 ఖాళీ పోస్టులు ఉన్నట్లు తెలిపారు. వాటికి మాత్రమే దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వివరించారు.

**ఏయే పోస్టులంటే..**

- ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్, ఏఎన్ఎం, అకౌంటెంట్, పార్ట్ టైం టీచర్స్, వార్డెన్ పోస్టులు జిల్లా యూనిట్‌గా భర్తీ చేస్తామని తెలిపారు.
- కుక్, హెడ్ కుక్, స్వీపర్, స్కావెంజేర్, డే/నైట్ వాచ్ ఉమెన్, చౌకిదార్ పోస్టులు మండల యూనిట్‌గా పరిగణించి ఎంపిక చేస్తామని వివరించారు.
- పై పోస్టులకు సంబంధించిన దరఖాస్తు నమూనా, విద్యార్హత వివరాలు, గౌరవ వేతనం, కేజీబీవీల వారీగా ఖాళీ పోస్టుల సంఖ్య, ఖాళీల రోస్టర్ పాయింట్లు ఇతర వివరాలు సమగ్రంగా http://samagrashikshaatp. blogspot. com వెబ్ సైట్‌లో పొందుపరచినట్లు వారు తెలిపారు. కేవలం నోటిఫై చేసిన ఖాళీ పోస్టులకు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. పూర్తి చేసిన దరఖాస్తులు, అర్హతలకు సంబందించిన స్టడీ సర్టిఫికెట్లు(నాల్గో తరగతి నుంచి పదో తరగతి వరకు), ఆధార్, కుల ధృవీకరణ కాపీలపై గజిటెడ్ అధికారితో అటేస్టేడ్ చేయించి ప్రతి పోస్టుకు విడివిడిగా దరఖాస్తునకు జతపరచాలని సూచించారు. మండల యూనిట్‌గా పరిగణించే పోస్టులకు ఆ మండల విద్యాశాఖాధికారి కార్యాలయములో, జిల్లా యూనిట్‌గా పరిగణించే పోస్టులకు సమగ్ర శిక్ష కార్యాలయం లెనిన్ నగర్, టి.వి.టవర్ దగ్గర, అనంతపురము కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఈ నెల 23వ తేదీ సాయంత్రము 5.00 గంటల లోపల సమర్పించాలని స్పష్టం చేశారు. గడువు ముగిసిన తరువాత వచ్చిన దరఖాస్తులు స్వీకరించేది లేదన్నారు.

# సంక్రాంత్రికి ఊరు వెళ్తున్నారా

- మీ ఇంటి భద్రతలపై అప్రమత్తంగా ఉండండి
- ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్పీ ఆదేశం

**మదనపల్లె – సూర్య వాస్తవం :** సంక్రాంతి పండుగకు ఊరు వేళ్తుంటే, తమ ఇంటి భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి శనివారం జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దొంగతనాలను నియంత్రిస్తూ, ప్రజలను చైతన్యపరచడానికి జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో మైకుల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

**పాటించాల్సిన జాగ్రత్తలు**

ఇంటి తలుపులకు, బాల్కనీలకు నాణ్యమైన తాళాలు వాడండి. గేట్లకు బయట నుంచి కాకుండా, లోపలి వైపు తాళం వేయడం వల్ల మీరు ఇంట్లో లేరనే విషయం బయటి వారికి తెలియకుండా ఉంటుంది. ఇంట్లో భారీ నగదు, బంగారు ఆభరణాలు పెట్టకుండా, బ్యాంక్ లాకర్లలో లేదా నమ్మకస్థులైన బంధువుల వద్ద ఉంచడం క్షేమకరం. ఇంటి పరిసరాల్లో హై-రిజల్యూషన్ సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకుని, వాటిని మొబైల్ ఫోన్‌కు అనుసంధానించడం ద్వారా ఎక్కడి నుంచైనా మీ



ఇంటిని పర్యవేక్షించవచ్చు. ఊరెళ్లే వారు తప్పనిసరిగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో లేదా బీట్ కానిస్టేబుల్ తెలపడం ద్వారా రాత్రి గస్తీని పటిష్ఠం చేయవచ్చు. రాత్రి వేళల్లో ఇంటి ఆవరణ, గ్యారేజ్ ప్రాంతాలు వెలుగుతో ఉండేలా చూడండి. చీకటి దొంగలకు అవకాశాన్ని ఇస్తుంది.

**పోలీసు అధికారులకు ఎస్పీ ఆదేశాలు**

ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలు, పట్టణాలు, కాలనీల్లో పోలీస్ వాహనాల ద్వారా మైకులను ఉపయోగించి ప్రజలకు రక్షణ సూచనలు వివరించాలి. మైకుల ద్వారా అవగాహన కల్పిస్తూనే, రాత్రి వేళల్లో పెట్రోలింగ్, బీట్ కానిస్టేబుళ్ల తనిఖీలను మరింత పటిష్టం చేయాలి. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే ప్రజలు ఫోటో తీసి డయల్ 112 లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చేలా ప్రజలను ప్రోత్సహించాలి. మీ భద్రత మా బాధ్యత, కానీ మీ జాగ్రత్త మాకు అదనపు బలం. పోలీసుల సూచనలు పాటించి, నేరరహిత సమాజానికి సహకరిస్తూ సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆకాంక్షించారు.

# క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి

**- శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి**






**పులివెందుల – సూర్య వాస్తవం:** మహిళా క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని శాసన మండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. సైకిల్ పోలో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 22వ సబ్ జూనియర్ (గర్ల్స్), 28వ జూనియర్ (గర్ల్స్), 26వ సీనియర్ (గర్ల్స్) జాతీయ సైకిల్ పోలో ఛాంపియన్‌షిప్ పోటీలు జేఎన్‌టీయూ పులివెందుల కళాశాల క్రీడా మైదానంలో ఘనంగా ప్రారంభ మయ్యాయి. శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొంది స్తాయని, గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా ప్రతిభా వంతులైన క్రీడాకారులు వెలుగులోకి రావాల్సిన అవసరం ఉందని, అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు తాము కృషి చేస్తామని తెలిపారు. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఢిల్లీ, జమ్మూ కాశ్మీర్, ఉత్తరప్రదేశ్, ఒడిశా, వెస్ట్ బెంగాల్, కర్ణాటక, కేరళ తదితర దాదాపు 17 రాష్ట్రాల నుంచి 37 జట్లు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న మహిళా సైకిల్ పోలో క్రీడా కారులు ఈ పోటీల్లో తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు. ఈ కార్యక్రమంలో సైకిల్ పోలో ఇండియా సెక్రటరీ దినేష్, ఇండియా టెక్నికల్ కమిటీ ఛైర్మన్ చందర్ రావు, ఇండియా సెలక్షన్ కమిటీ ఛైర్మన్ ఎమ్ ఎల్ నాయక్, కడప జిల్లా గ్రంధాలయ ఛైర్మన్ దాసరి భాను ప్రకాష్, ఏపీ స్టేట్ ప్రెసిడెంట్ రామకృష్ణ రావు, ఆర్గనైజర్ రేవంత్ తో పాటు క్రీడా సంఘ ప్రతినిధులు, కోచ్‌లు, రిఫరీలు, క్రీడాకారులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రకృతితో ముడిపడి ఉన్న పండుగల ఆచారాలు భవిష్యత్ తరాలకు తెలియాలి

**- ఆచారాలను ఆచరించడంలో ఉన్న అనుభూతిని ఆస్వాదించాలి**

**- నలంద హైస్కూల్ కరస్పాండెంట్ వెంకటస్వామి రెడ్డి**





**పులివెందుల – సూర్య వాస్తవం :** నాగరికత పెరిగినప్పటికీ, ఆధునికతను అందిపుచ్చుకున్నప్పటికీ ప్రకృతితో ముడిపడి ఉన్న మన పండుగలు, ఆచారాలను ఆచరించడంలో ఉన్న అనుభూతిని భవిష్యత్ తరాలకు తెలియ జేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని నలంద టెక్నో హై స్కూల్ కరస్పాండెంట్ వెంకటస్వామి రెడ్డి పేర్కొన్నారు. పులివెందులలోని నలంద టెక్నో హై స్కూల్‌లో శనివారం ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం విద్యార్థులచే ప్రకృతిని మరిపించే విధంగా ఆటపాటలతో రంగురంగుల ముగ్గులు వేసి ఉబ్బెమ్మలతో అలంకరించి రంగా రంగ వైభవంగా సంక్రాంతి పండుగ విశేషాలను చిన్నారులకు అర్థమయ్యే విధంగా పాఠశాల యాజమాన్యం వెంకటస్వామి రెడ్డి, హెడ్మాస్టర్ సోమశేఖర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు రైతుల వేషధారణతో ఆహుతులను అలరింపచేయగా, గంగిరెద్దుల ఫోటోలను అలంకరించి, కోడి పందాల నిర్వహణ విషయాలను, భోగి పండుగ ప్రాముఖ్యతను మొదలగు సంక్రాంతి పర్వదిన విశేషాలను అందరికీ అర్థమయ్యే విధంగా యాజ మాన్యం చిన్నపిల్లలను తీర్చిదిద్ది వారిని పూలతో ఆశీర్వదించారు. చిన్నపిల్లలకు పండగ విశేషాలను వివరించా లన్న సంకల్పంతో నలంద స్కూల్ యాజమాన్యం ముందస్తుగా సంక్రాంతి వేడుకలు నిర్వహించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు యాజమాన్యానికి ధన్యవాదాలు తెలియజేశారు.

# స్వామి వివేకానంద బోధనలు విద్యార్థులకు మార్గదర్శకం

**- ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి**






**వేంపల్లె – సూర్య వాస్తవం :** వేంపల్లిలోని స్వామి వివేకానంద ఇంగ్లీష్ మీడియం పాఠశాల 25వ వార్షికోత్సవం, స్వామి వివేకానంద 164వ జన్మదినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి పాల్గొని, విద్యార్థులను ఉద్దేశించి స్వామి వివేకానంద జీవితం, ఆయన బోధనలు, యువతపై ఆయన ఆశయాల గురించి ప్రేరణాత్మకంగా మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, దేశభక్తి విలువలను అలవర్చుకుని ఉన్నత లక్ష్యాల సాధనకు కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నర్రెడ్డి తులసి రెడ్డి, రామాంజనేయ రెడ్డి , మాజీ ఎం.పి.టి.సి జి.వి. రమణ, బొజ్జా మైసూర రెడ్డి , డివి సుబ్బారెడ్డి, తాళ్ళపల్లి వెంకటేశ్వర రెడ్డి, జ్ఞానేశ్వర్ నాయుడు, పోతిరెడ్డి శివ, భాను తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా ఎస్‌విబిఎస్ మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్





**బ్రహ్మంగారిమఠం – సూర్య వాస్తవం :** సంక్రాంతి ఉత్సవాలలో భాగంగా తెలుగు గంగ కాలనీలోని మైదానంలో ఎస్‌వి బిఎస్ క్రికెట్ టోర్నమెంట్‌ను బ్రహ్మంగారి మఠం మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు. చెన్నుపల్లె సుబ్బారెడ్డి, మండల టిడిపి సీనియర్ నాయకులు మూడమాల పోలిరెడ్డి, యస్ ఆర్ శ్రీనివాసులు రెడ్డి, సహకార బ్యాంకు చైర్మన్ యల్లటూరు సాంబ శివారెడ్డి, పూజ శివయ్య యాదవ్, ఆవుల దస్తగిరి, నాయుడు మరియు మండల టిడిపి నాయకులు పాల్గొని... మైదానంలో రిబ్బన్ కటింగ్ చేసి... టోపీని ఆవిష్కరించారు. అమ్మవారి శాల అధ్యక్షుడు అయ్యప్ప వెంకట సురేష్ బాబు, ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు, బాలకృష్ణ, (ఎద్దులాయపల్లె) రెడ్లదిన్నె నాగ ఖాదరయ్య, ఇటుకల ప్రసాద్, క్రికెట్ టోర్నమెంట్ టీమ్స్ పాల్గొన్నారు.

# ఘనంగా ముగిసిన భాగవత సప్తహ శ్రవణ యజ్ఞం

**సింహాద్రిపురం – సూర్య వాస్తవం :** సింహాద్రిపురం శ్రీ అవధూత బుడ్డయ్య స్వామి ఆలయంలో గత 7 రోజులుగా నిర్వ హిస్తున్న భాగవత సప్తహ శ్రవణ యజ్ఞం శనివారంవైభవంగా ముగిసింది. వాటిలో భాగంగా వేకువ జామున బ్రహ్మోమూర్తం లో పారాయణం పఠనం మంత్ర పుష్పం అనంతరం మహిళలచే ఆలయం చుట్టు కలశ ప్రదర్శనం ఓం నమో భగవతే వాసు దేవాయ అంటూ నామస్మరణ తో ఆలయ ప్రాంగణం మారుమోగాయి, వాటిలో భాగంగా పండితులకు ఘన సత్కారంలతో సప్తహ పఠనం ముగిసింది. 7 రోజుల పాటు అల్పాహారం అన్నప్రసాదం తది తరం ఏర్పాటు చేసిన దాతలకు శ్రీ జగద్గురు ఆదిశంకరాచార్య భక్త సమాజం వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం శ్రీజగద్గురు ఆదిశంకరాచార్య నిర్వహణలో గ్రామస్తులు దాతలసహకారాలతో విజయవంతంగా ముగిసింది. నిర్వహకులు పామిశెట్టి వెంకట స్వామి పండితులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే మీడియా ఇంచార్జ్ యాగంటి బాలకృష్ణారెడ్డి సమావేశానికి హాజరైన భాగవత పండితులు తదితరులకు నూతన సంవత్సర క్యాలండర్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆకుల బుడ్డన్న ఆంజనేయులు దంపతులు అల్పాహారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.






# కొన్ని తీస్తున్నాం..కొత్త సీన్లు యాడ్ చేస్తున్నాం

బ్లాక్ బస్టర్ సెలబ్రేషన్స్‌లో ప్రొడ్యూసర్ టీజీ విశ్వప్రసాద్, డైరెక్టర్ మారుతి రెబల్ స్టార్ ప్రభాస్ నటించిన ప్రెస్టీజియస్ మూవీ "రాజా సాబు నిన్న శుక్రవారం థియేటర్స్ లోకి వచ్చి బ్లాక్ బస్టర్ సక్సెస్ అందుకుంది. ఈ చిత్రాన్ని హారర్ ఫాంటసీ జానర్ లో ఎవర్ గ్రీన్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చేలా రూపొందించారు దర్శకుడు మారుతి. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై గ్లోబల్ సినిమా స్థాయిలో గ్రాండ్ గా మూవీని నిర్మించారు ప్యాషనేట్ ప్రొడ్యూసర్స్ టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ తమ పర్ ఫార్మెన్స్ లు, అందంతో ఆకట్టుకున్నారు. "రాజా సాబు సినిమా వరల్డ్ వైడ్ హ్యూజ్ కలెక్షన్స్ తో సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతున్న నేపథ్యంలో ఈ రోజు మూవీ టీమ్ కింగ్ సైజ్ బ్లాక్ బస్టర్ పేరుతో హైదరాబాద్‌లో సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో

**హీరోయిన్ రిద్ధి కుమార్ మాట్లాడుతూ –** "రాజా సాబు సినిమాను ప్రేక్షకులు, ఫ్యాన్స్ బాగా ఎంజాయ్ చేస్తున్నారు. మా సినిమాకు ప్రతి ఒక్కరి నుంచి దక్కుతున్న ఆదరణ చూస్తుంటే హ్యాపీగా ఉంది. ఈ సినిమా కోసం మూడేళ్ల కష్టపడ్డాం. టీమ్ మొత్తం చాలా ఎఫర్ట్స్ పెట్టింది. మా ప్రయత్నానికి రిజల్ట్ గా ప్రేక్షకులు మంచి సక్సెస్ ఇచ్చారు. సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా మా మూవీని అప్రిషియేట్ చేస్తూ చాలా మెసేజ్ లు వస్తున్నాయి. ఆడియెన్స్ అందరికీ థ్యాంక్స్. అన్నారు.

**హీరోయిన్ నిధి అగర్వాల్ మాట్లాడుతూ –** "రాజా సాబు సినిమా బ్లాక్ బస్టర్ ఓపెనింగ్స్ తో బాక్సాఫీస్ జర్నీ స్టార్ట్ చేసింది. ప్రేక్షకులు మా సినిమాను ఇష్టపడుతున్నారు. ఈ సంక్రాంతికి పర్ఫెక్ట్ ఫ్యామిలీ మూవీ ఇది. పిల్లలతో కలిసి మీరు ఈ సినిమాను ఎంజాయ్ చేయొచ్చు. ప్రేక్షకులు "రాజా సాబు కనెక్ట్ అయ్యింది. మొసలి ఎపిసోడ్, క్లైమాక్స్..ఇలా చాలా ఎపిసోడ్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. థియేటర్స్ లో డార్లింగ్ డార్లింగ్ అని అంతా అంటున్నారు. "రాజా సాబు సక్సెస్ తో మేమంతా హ్యాపీగా ఉన్నాం. అన్నారు.

హీరోయిన్ మాళవిక మోహనన్ మాట్లాడుతూ -- "రాజా సాబు అందరినీ ఎంటర్ టైన్ చేస్తూ మంచి కలెక్షన్స్ అందుకుంటోంది. ఈ సినిమాలో నేను చేసిన భైరవి పాత్రకు మంచి రెస్పాన్స్ వస్తోంది. నేను చేసిన యాక్షన్ సీక్వెన్స్ ను థియేటర్స్ లో ఆడియెన్స్ బాగా ఎంజాయ్ చేస్తున్నారు. ఇలాంటి మంచి రోల్ ఇచ్చిన డైరెక్టర్ మారుతి గారికి థ్యాంక్స్. ఒక పెద్ద విజన్ తో విశ్వప్రసాద్ గారు "రాజా సాబు సినిమాను నిర్మించారు. ప్రభాస్ గారి సరసన నటించాలనేది నా డ్రీమ్. అది "రాజా సాబు తో నిజమైంది. ఫ్యూచర్ లో మళ్లీ ప్రభాస్ గారితో కలిసి నటించాలని కోరుకుంటున్నా. అన్నారు.

**ప్రొడ్యూసర్ టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ –** "రాజా సాబు సక్సెస్ తో హ్యాపీగా ఉన్నాం. తొలి రోజు 100 కోట్ల రూపాయలు వరల్డ్ వైడ్ కలెక్ట్ చేస్తుందని ఆశించాం. మా అంచనాలు మించి 112 కోట్ల రూపాయలు వసూళ్లు తొలి రోజు "రాజా సాబుకు దక్కాయి. గ్లోబల్ గా కలెక్షన్స్ డీటెయిల్స్ వస్తున్నాయి. ఈ నెంబర్ ను అఫీషియల్ గా అనౌన్స్ చేస్తాం. కిడ్స్, ఫ్యామిలీస్ మా మూవీకి వస్తున్నారు. ఫ్యామిలీ ఆడియెన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. ప్రభాస్ గారు ఓల్డ్ గెటప్ లో చేసిన 4 నిమిషాల సీన్స్ కొన్ని టెక్నికల్ రీజన్స్ వల్ల సినిమాలో చూపించలేకపోయాం. ఆ సీన్స్ ఇప్పుడు థియేటర్స్ కు పంపించాం. ఇక రాజాసాబ్ ప్రతి షోలో ప్రభాస్ గారి ఓల్డ్ గెటప్ సీన్స్ చూస్తారు. హారర్ ఫాంటసీ జానర్ లో ఈ సినిమాను నిర్మించాం. కొందరు ఇంటలెక్చువల్స్ నుంచి మిక్స్డ్ రియాక్షన్స్ వచ్చాయి. హారర్ ఫాంటసీని డీప్ గా వెళ్లి కొందరు విశ్లేషణలు చేశారు. అవన్నీ వదిలేస్తే సినిమా బాగా రన్ అవుతోంది. ఇది ఇలాగే కొనసాగి సంక్రాంతికి మంచి విజయం దక్కుతుందని ఆశిస్తున్నాం. అన్నారు.

**డైరెక్టర్ మారుతి మాట్లాడుతూ –** మిడ్ రేంజ్ డైరెక్టర్ అయిన నాకు ప్రభాస్ గారితో సినిమా చేశాననే క్రెడిట్ దక్కడం సంతోషంగా ఉంది. ఈ అవకాశం కల్పించిన ప్రభాస్ గారికి జన్మంతా రుణపడి ఉంటాను. 9 నెలలకో సినిమా చేసే నేను మూడేళ్లు కష్టపడి ఈ సినిమాను రూపొందించాను. ప్రభాస్ గారిని మీరు ఎలా చూడాలనకుంటున్నారో అలా తెరకెక్కించాను. సినిమా చూసిన వాళ్లు ఇప్పటిదాకా ఇండియన్ స్క్రీన్ మీద ఒక కమర్షియల్ హీరోతో ఇలాంటి మైండ్ గేమ్ సినిమా రాలేదని అప్రిషియేట్ చేస్తున్నారు. ఆ 40 నిమిషాల ఎపిసోడ్ కు వరల్డ్ వైడ్ అందరు ప్రశంసిస్తున్నారు. కొత్త పాయింట్ తో వచ్చిన సినిమా ఒక్క రోజుకే అందరికీ నచ్చి పెద్ద హిట్ కాదు. కొత్త పాయింట్ ఎప్పుడైనా ప్రేక్షకులకు రీచ్ అయ్యేందుకు కొంత టైమ్ తీసుకుంటుంది. మేము చెప్పాలనుకున్న కొత్త పాయింట్ పై ఇంటలెక్చువల్స్ ఒకలా మాట్లాడుతున్నారు. అర్థం కాని వాళ్లు తిడుతున్నారు. రకరకాల రెస్పాన్స్ లు వస్తున్నాయి. ఇలాంటి సందర్భంలో అప్పుడే ఒక సినిమా ఫలితాన్ని డిసైడ్ చేయొద్దు. ఓల్డ్ గెటప్ లో ప్రభాస్ గారిని ట్రైలర్ లోనే పరిచయం చేశాం. ఆయన స్వాగ్, గెటప్, మేనరిజమ్ చూపించాం, థియేటర్స్ లోకి వచ్చేసరికి ఆ ప్రభాస్ గారి సీన్స్ ఏవి అని ప్రేక్షకులు వెతుక్కున్నారు. ఆ క్రమంలో మేము చూపించే కథకు వారు కనెక్ట్ కాలేకపోయారు. చాలా మంది ప్రభాస్ గారి అభిమానులు నాతో మాట్లాడారు. సినిమా బాగా చేశావన్నా అని అన్నారు. ఓల్డ్ గెటప్ సీన్స్ వస్తే బాగుంటుందన్నా అన్నారు. వారి సూచన మేరకు ప్రభాస్ గారి ఓల్డ్ గెటప్ సీన్స్ ను యాడ్ చేశాం. ఈ రోజు సాయంత్రం షోస్ నుంచి ఆ సీన్స్ రాజా సాబ్ మూవీలో చూస్తారు. రూఫ్ మీద ఫైట్ ఇప్పటిదాకా రాలేదు. 8 నిమిషాల ఆ ఫైట్ లో ప్రభాస్ గారి స్వాగ్, స్టైల్ ను ఇవాళ్టి నుంచి ఎంజాయ్ చేస్తారు. ఎక్కడైతే కొందరు లెంగ్త్, ల్యాగ్ అని ఫీలయ్యారో వాటిని షార్ప్ చేశాం. ఈ రోజు సాయంత్రం షోస్ నుంచి రియల్ రాజా సాబ్ గా నేను ఫీలయిన ప్రభాస్ గారిని స్క్రీన్స్ మీద చూపించబోతున్నాం. దీంతో ఫ్యాన్స్ సంతృప్తి చెందుతారని నమ్ముతున్నాను. సంక్రాంతికి వస్తున్న అన్ని మూవీస్ ఆదరణ పొందాలి. రాజా సాబ్ సినిమా చూసి నా డైరెక్టర్ ఫ్రెండ్స్, అల్లు అర్జున్ ఫోన్ చేసి అభినందించాడు. నేను హ్యాపీగా ఉన్నాను. నార్మల్ రేట్స్ కే రాజా సాబ్ సినిమాను మీరు థియేటర్స్ లో చూడొచ్చు. అన్నారు.

నటీనటులు – ప్రభాస్, నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్, సంజయ్ దత్, బొమన్ ఇరానీ, తదితరులు

**టెక్నికల్ టీమ్**

ఎడిటింగ్ –కోటగిరి వెంకటేశ్వరరావు
సినిమాటోగ్రఫీ – కార్తీక్ పళని
మ్యూజిక్ – తమన్
ఫైట్ మాస్టర్ – రామ్ లక్ష్మణ్, కింగ్ సోలొమన్
ప్రొడక్షన్ డిజైనర్ – రాజీవన్
క్రియేటివ్ ప్రొడ్యూసర్ – ఎస్ కేఎన్
పీఆర్ఓ – జీఎస్ కే మీడియా (సురేష్– శ్రీనివాస్), వంశీ కాకా
ప్రొడ్యూసర్స్ – టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్
రచన, దర్శకత్వం – మారుతి



# ఉత్కంఠ పోరులో గుజరాత్ గెలుపు

- లిచ్‌ఫీల్డ్ మెరుపులు వృథ
-10 పరుగుల తేడాతో ఓడిన యుపి వారియర్స్



**నవీముంబయి:** మహిళల ప్రీమియర్ లీగ్ సీజన్-4లో మరో ఉత్కంఠ పోరు జరిగింది. డివై పాటిల్ స్టేడియంలో చివరి ఓవర్ వరకు హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ 10 పరుగుల తేడాతో యుపి వారియర్స్‌పై గెలిచింది. ఛేద నలో భాగంగా యుపి బ్యాటర్ ఫోబె లిచ్‌ఫీల్డ్ (78) అర్ధ శతకంతో పోరాడినా.. చివర్లో ఆశా శోభన(27 నాటౌట్) వరుసగా 6, 4 కొట్టినా.. యుపిని గెలిపించలేకపోయారు. దీంతో 208 పరు గుల భారీ ఛేదనకు దిగిన యుపి జట్టు నిర్ణీత ఓవర్లు ముగిసేసరికి 197 పరుగులకే పరిమితమైంది. శుక్రవారం జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో బెంగళూరు జట్టు చివరి 4బంతుల్లో 20పరుగులు కొట్టి సంచలన నమోదు చేయగా.. గుజరాత్-యుపి జట్ల మధ్య జరిగిన రెండో మ్యాచ్ కూడా ప్రేక్షకులను కనువిందు చేసింది. గుజరాత్ బౌలర్లలో రేణుకా సింగ్(2/25), జార్జియా వరేహం(2/30), సోఫీ డెవినె(2/55)లు రెండేసి వికెట్లతో రాణించారు.

టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న యుపి వారియర్స్ కెప్టెన్ నమ్మకం వమ్ము అయ్యింది. గుజరాత్ ఓపెనర్లు బేత్ మూనీ(13), సోఫీ డెవినె(38) ఇచ్చిన శుభారంభాన్ని కెప్టెన్ అషే గార్డ్‌నర్(65), అనుష్క శర్మ(44)లు కొనసాగిం చారు. అయితే.. పవర్ ప్లేలోనే ఓపెనర్లు ఔట్ కావడంతో గుజరాత్ 55 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది. ఆ తర్వాత స్టార్ ఆల్‌రౌండర్ గార్డ్‌నర్, అనుష్కలు ఏమాత్రం ఒత్తిడికి లోనవ్వకుండా స్కోర్‌బోర్డును పరుగెత్తించారు. టెయిలెండర్లు జార్జియా వరేహం(27), భారతి ఫుల్‌మాలి(14) చివర్లో సిక్సర్లతో విరుచుకుపడ్డారు. దీప్తి వర్మ వేసిన 20వ ఓవర్లో భారతి వరుసగా రెండు సిక్సర్లు బాదడంతో గుజరాత్ స్కోర్ రెండొందలు దాటింది. యుపి బౌలర్లు ఎక్లేస్టోన్‌కు రెండు, శిఖాపాండే, డోటిన్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ వారేహామ్‌కు దక్కింది.

**స్కోర్‌బోర్డు:** గుజరాత్ జెయింట్స్ మహిళల ఇన్నింగ్స్: బెత్ మూనీ (బి)ఎక్లేస్టేన్ 13, సోఫీ డివైన్ (సి)లిచ్‌ఫీల్డ్ (బి)శిఖా పాండే 38, అనుష్క శర్మ (సి)హర్లిన్ డియోల్ (బి)డోటిన్ 44, గార్డినర్ (బి)ఎక్లేస్టోన్ 65, వారేహామ్ (నాటౌట్) 27, ఫుల్మాని (నాటౌట్) 14, అదనం 6. (20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి) 207పరుగులు) వికెట్ల పతనం: 1/42, 2/55, 3/158, 4/173 బౌలింగ్: క్రాంతి గాడ్ 3-0-30-0, శిఖా పాండే 4-0-29-1, డోటిన్ 4-0-47-1, దీప్తి శర్మ 3-0-32-0, ఎక్లేస్టోన్ 4-0-32-2, శోభన 3-0-36-0,

యుపి వారియర్స్ మహిళల ఇన్నింగ్స్: నవ్‌గైర్ (బి)రేణుకా సింగ్ 1, లానింగ్ (ఎల్‌బి)వారేహామ్ 30, లిచ్‌ఫీల్డ్ (సి)ఫుల్మాలి (బి)సోఫీ డివైన్ 78, హర్లిన్ డియోల్ (సి అండ్ బి)వారేహామ్ 0, దీప్తి శర్మ (సి అండ్ బి) రేణుకా సింగ్ 1 శ్వేతా సెహ్రావత్ (బి)గైక్వాడ్ 25, డోటిన్ (సి) ఫుల్మాలి (బి)గార్డినర్ 12, ఎక్లేస్టోన్ (సి)కశ్వీ గౌతమ్ (బి)సోఫీ డివైన్ 11, శోభన (నాటౌట్) 27, శిఖా పాండే (నాటౌట్) 1, అదనం 11. (20 ఓవర్లలో 8వికెట్ల నష్టా నికి) 197పరుగులు. వికెట్ల పతనం: 1/3, 2/73, 3/73, 4/74, 5/143, 6/150, 7/167, 8/182 బౌలింగ్: రేణుకా 4-0-25-2, కశ్వీ గౌతమ్ 4-0ఐ-38-0, సోఫీ డివైన్ 4-0-55-2, గార్డినర్ 3-0-37-1, వారేహామ్ 4-0-30-2, రాజేశ్వరి 1-0-7-1.



# సెన్సార్‌బోర్డు తీరు మారాలని కమల్ ట్వీట్

కోలీవుడ్ నటుడు విజయ్ నటించిన 'జన నాయగణ్' సినిమాకు సెన్సార్‌బోర్డు నుంచి ధృవీకరణ పత్రం రాకపోవటంతో విడుదల వాయిదా పడింది. శుక్రవారమే రాజాసాబ్‌తోపాటుగా ఈ సినిమా కూడా విడుదల కావాల్సివుంది. ప్రముఖ నటుడు, రాజ్యసభ సభ్యులు కమల్‌హాసన్ ఒక ట్వీట్ చేశారు. కళకు, కళాకారులకు, రాజ్యాంగానికి మద్దతుగా అంటూ అధికారిక ప్రకటనను కమల్‌హాసన్ విడుదల చేశారు. 'భారతదేశ రాజ్యాంగం మనందరికీ భావ ప్రకటనా స్వేచ్ఛను కల్పించింది. కానీ, దానిని నేడు కొందరు అంధకారంలోకి నెట్టివేస్తున్నారు. ఇది ఒక్క సినిమాకు సంబంధించిన విషయం కాదు. కళాకారులకు మన రాజ్యాంగ ప్రజాస్వామ్యంలో ఇచ్చే స్థానం గురించి కూడా ప్రతిబింబిస్తుంది. సినిమా అనేది కేవలం ఒక వ్యక్తి కృషి మాత్రమే కాదు. ఇందులో రచయితలు, సాంకేతిక నిపుణులు, నటులు, చిన్న వ్యాపారులు కూడా భాగస్వామ్యంగా కలిసి నిర్మించే సమిష్టి శ్రమ. వీరి జీవనాధారం ఇందులో భాగమై ఉంటుంది. సమాజంలో ఇలాంటి అంశాల్లో స్పష్టత లేకపోతే సృజనాత్మకత కుంటుపడుతుంది. ఆపై ఆర్థిక కార్యకలాపాలు నిలిచిపోతాయి. సినిమా సర్టిఫికేషన్ ప్రక్రియను మరోసారి పునఃపరిశీలించాలి. ఒక సినిమాకు ఇవ్వాల్సిన అనుమతులకు నిర్దిష్ట సమయ పరిమితులు ఉండాలి. అందులో పారదర్శకంగా అధికారులు పనిచేయాలి. సినిమా నుంచి ఏదైనా సీన్‌కు అభ్యంతరం ఉంటే అందుకు సంబంధించిన మార్పులను రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలి. సినిమా పరిశ్రమ మొత్తం ముందుకు రావాల్సిన సమయం వచ్చింది' అంటూ విజయ్ కు మద్దతుగా కమల్ ట్వీట్ చేశారు.

# కిటకిటలాడుతున్న ఆర్టీసీ బస్టాండ్

## - సంక్రాంతి సెలవులకు పెరిగిన రద్దీ
## - బస్సుల కోసం ప్రయాణికుల పాట్లు



**మదనపల్లె - సూర్య వాస్తవం:** మదనపల్లి ఆర్టీసీ బస్టాండ్ శనివారం ప్రయాణికులతో కిటకిటలాడింది. శనివారం నుంచి అన్ని విద్యాసంస్థలకు సంక్రాంతి సెలవులు ప్రకటించడంతో అధిక సంఖ్యలో వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులు తమ ఇళ్లకు బయలు దేరేంకు ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణానికి చేరుకున్నారు. దీంతో బస్టాండ్ ప్రాంగణం ప్రయాణికులతో కిటకిటలాడింది.అంతేకాకుండా పండగ పర్వదినాన్ని పురస్కరించుకుని ఉద్యోగస్తులు తమ సొంతవాళ్లకు వెళ్లేందుకు సెలవులు తీసుకుని ఊళ్లకు బయలు దేరడంతో ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం ప్రయాణికులతో నిండిపోయింది. సమయానికి బస్సులు రాకపోవడం, రద్దీకి అనుగుణంగా బస్సులు లేకపోవడం తో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా బస్టాండ్ పాయింట్ల వద్ద వేచి ఉన్న ప్రయాణికులకు ఏమి జరుగుతుందో అర్థం కాలేదు. కొన్ని బస్సులు బస్టాండు లోపలికి వచ్చే ముందే ఆపేసి పాయింట్ లోకి వచ్చే ముందే ప్రయాణికులతో ఫుల్లుగా నిండిపోయి వచ్చాయి. ఈ విషయంఅబశ్రీశ్రీ తెలియని చాలా మంది ప్రయా ణికులు బస్టాండ్ వద్ద గంటలు తరబడి వేచి ఉన్నారు. బస్సులు వసతున్నాయి.. వెళ్తున్నాయి కానీ బస్సులో కాలు పెట్టే స్థలం కూడా లేకపోవడంతో మరో బస్సు కోసం వేచి ఉంటూ గంటల తరబడి బస్టాండ్ లోనే వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. ఇక చేసేది లేక అతి కష్టమ్మీద రద్దీ బస్సులో ఎక్కువ మంది ప్రయాణికులు నిలబడుకునే ప్రయాణం చేశారు. ముఖ్యంగా రద్దీని దృష్టిలో పెట్టుకొని అదనపు బస్సులు ఏర్పాటు ఆర్టీసీ అధికారులు విఫలం చెందారు. దీంతో రెగ్యులర్ బస్సుల్లోనే ప్రయా ణికులు తమ గమ్యస్థానాలకు చేరుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో బస్సులో ఇసుక వేస్తే కిందపడనంత రద్దీగా ఉండడంతో ప్రయాణికులు నిలబడుకొని ప్రయాణం చేయాల్సి వచ్చింది. ముఖ్యంగా కదిరి, అనంతపురం, బస్టాప్ ల వద్ద గంటలు తరబడి వందల సంఖ్యలో ప్రయాణికులు వేచి ఉన్నారు. తిరుపతి, పీలేరు, పలమనేరు, చిత్తూరు, తంబళ్లపల్లి, బి. కొత్తకోట తదితర ప్రాంతాల్లోనూ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నేటి నుంచి ప్రభుత్వం సంక్రాంతి సెలవులు ప్రక టించడం, దీంతోపాటు పండుగలకు సొంత ఊర్లకు వెళ్లే వారితో ప్రయాణికులు పెరిగే అవకాశం ఉందని, ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఆదనపు సర్వీసులు నడపాలని, ఎలాంటి ఇబ్బంది లేకుండా బస్సు పాయింట్లు వరకు బస్సులు వచ్చి ప్రయాణికులను ఎక్కించుకోవాలని పలువురు కోరుతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది.



## కోడిపందాలపై ప్రత్యేక నిఘా

### - సంక్రాంతి పండుగ శాంతియుతంగా నిర్వహించుకోవాలి
### - డి.ఎస్.పి మురళి నాయక్



**పులివెందుల - సూర్య వాస్తవం :** రానున్న సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పులివెందుల నియోజకవర్గంలో కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటా మని అదే విధంగా కోడి పందాలపై ప్రత్యేక నిఘా ఉంచడం జరుగుతుందని సంక్రాంతి పండుగ శాంతియుతంగా నిర్వహించుకోవాలని పులివెందుల డి.ఎస్.పి మురళి నాయక్ సూచించారు. ఈ సందర్భంగా పత్రికా ముఖంగా ఆయన మాట్లాడుతూ పండుగను పురస్కరించుకొని పులివెందుల నియోజకవర్గంలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు చేపడతామని, పండుగ కుటుంబ సభ్యులతో ప్రశాంత వాతావరణంలో ప్రతి ఒక్కరూ జరుపుకోవాలని, కోడి పందాల నియంత్రణ కోసం ప్రత్యేక నిఘా ఉంచి టీమ్లు ఏర్పాటు చేయడం జరిగిందని, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే తారతమ్యం లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని, నియోజకవర్గ వ్యాప్తంగా డ్రోన్ సహాయంతో నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎక్కడ ఈ అవాంఛనీయ కార్యక్రమాలు జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలియజేస్తూ ముందుగా పులివెందుల నియోజకవర్గం ప్రజలకు అధికారులకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## ఇది ఒక భవనం మాత్రమే కాదు..
## సేవలకు నిలయం

### - రేపటి తరాలకు వెలిగించే సేవా దీపం
### - చిన్న సాయం సేవా స్వప్నానికి సహకారం
### - సేవల ప్రయాణానికి చేయూతనిద్దాం

**పులివెందుల- సూర్య వాస్తవం :** మూడు దశాబ్దాలుగా స్నేహిత అమృత హస్తం సేవా సమితి అనాధలు, అభాగ్యులు, ఆపన్నహస్తం కోరుకునే వారి జీవితాల్లో ఆశ వెలిగి స్తోంది. సమాజం పట్టించుకోని అనేక సమస్యలకు ఈ సమితి తన సేవలతో పరి ష్కార మార్గం చూపింది. నిరంతర సేవలే ధ్యేయంగా ముందుకు సాగుతున్న ఈ సంస్థకు ఇప్పుడు శాశ్వతమైన ఆశ్రయం అవసరమైంది. ఈ లక్ష్యంతో చేపట్టిన నూతన భవన సముదాయం నిర్మాణానికి కొంతమంది దాతలు ముందుకు వచ్చి చేయూతనిచ్చారు. వారి సహకారంతో భవనం ప్రస్తుతం 50 శాతం వరకు పూర్తయింది. అయితే మిగిలిన నిర్మాణం పూర్తి కావాలంటే ఇంకా మరిన్ని దాతల సహకారం అత్యవసరం. ఇది కేవలం ఒక భవనం కాదౌ సేవలకు నిలయంగా మారే ఆశ్రమం. రేపటి తరాలకు సేవా దీపం వెలిగించే కేంద్రం. ఒక్కొక్కరి చిన్న సహాయం కలిసివస్తే, పెద్ద సేవా స్వప్నం సాకారం అవుతుంది. సమాజ శ్రేయస్సు కోరుకునే ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి స్నేహిత అమృత హస్తం సేవాసమితి భవన నిర్మాణానికి చేయూతనిచ్చితే, సేవల ప్రయాణం మరింత బలంగా కొనసాగుతుంది.





## డిజిటల్ అరెస్ట్ అనేది ఒకరకమైన సైబర్ మోసం

### - ఆన్‌లైన్ సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
### - పులివెందుల అర్బన్ సిఐ సీతారాం రెడ్డి

**పులివెందుల- సూర్య వాస్తవం :** ఆన్‌లైన్ సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పులివెందుల అర్బన్ సిఐ సీతారాం రెడ్డి పేర్కొన్నారు. శనివారం పులి వెందుల మున్సిపాలిటీ పరిధిలోని జండా వీధిలో సిఐ సీతారామరెడ్డి, తన సిబ్బంది తోటి ఆర్థిక అక్షరాక్షత కేంద్రం ఇంచార్జ్ దివాకర్ ఆధ్వర్యంలో వారి సిబ్బంది తో కలిసి ప్రజలకు డిజిటల్ అరెస్ట్ అంటే ఏమిటి డిజిటల్ అరెస్టు వల్ల ప్రజలు ఏ విధంగా మోసపోతారో వారికి తెలియచేయడజరిగినది.ఈ సందర్భంగా సి ఐ మాట్లాడుతూ డిజిటల్ అరెస్ట్ అనేది ఒకరకమైన సైబర్ మోసం, ఇందులో నేరగాళ్లు తమను తాము పోలీసులు, ప్రభుత్వ అధికారులుగా నటిస్తూ వీడియో కాల్స్ లేదా ఫోన్ కాల్స్ ద్వారా బాధితులను భయపెట్టి, మనీలాండరింగ్, డ్రగ్స్ స్మగ్లింగ్ వంటి తప్పుడు ఆరోపణలు చేసి, కేసు లేకుండా చేయాలంటే డబ్బు చెల్లించాలని డిమాండ్ చేస్తారు. ఇది బాధితుడిని మానసికంగా భయపెట్టి, వారి డిజిటల్ గుర్తింపు లేదా ఆర్థిక ఖాతాలను నియంత్రించే ప్రయత్నం అని,నేరగాళ్లు సీబీఐ, ఈడీ, కస్టమ్స్ వంటి అధికారులమని చెప్పుకుంటారు, అధికారిక లోగోలు, యూనిఫామ్ ఉన్న నకిలీ వీడియోలను పంపుతారు.ఎవరైనా ఫోన్ చేసి ఇలాంటి ఆరోపణలు చేస్తే, అది మోసమని గుర్తించలని సూచనలు సలహాలు అందిస్తూ ఎవరికైనా అనుమానస్పదం కలిగితే వెంటనే పోలీస్ స్టేషన్ ను సంప్రదించాలని తెలిపారు.

## వైఎస్ అభిషేక్ రెడ్డికి నివాళులర్పించిన ఎంపీ అవినాష్ రెడ్డి



**పులివెందుల- సూర్య వాస్తవం :** యువతరంలో కలలు కంటూ వాటి ఆశయ సాధనకు నిరంతరం శ్రమించిన వైఎస్ అభిషేక్ రెడ్డి యువతకు ఆదర్శమని, అభిషేక్ రెడ్డి భౌతికంగా దూరమైన ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని జిల్లా ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పేర్కొన్నారు. వైకాపా నాయకుడు వై.యస్. మదన్ మోహన్ రెడ్డి కుమారుడు వై.యస్.ఆర్.సి.పి. వైద్యుల విభాగం రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగిన వైయస్ అభిషేక్ రెడ్డి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని వైఎస్ కుటుంబ సభ్యుల సమాధుల తోటలో జిల్లా ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, వైయస్ మనోహర్ రెడ్డి, వైయస్ భారతీ రెడ్డి, వైయస్ మదన్ మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ ఇతర వైకాపా నాయకులు తదితరులు వైయస్ అభిషేక్ రెడ్డికి ఘన నివాళులు అర్పిం చారు. ఈ సందర్భంగా అవినాష్ రెడ్డి మాట్లాడుతూ యువతరం ఆశలు, కలలు, సేవలు తదితర అంశాల ఆశయ సాధనకు నిరంతర కృషిచేసి ఉన్నత స్థాయికి ఎదిగిన వైయస్ అభిషేక్ రెడ్డి చిన్నతనంలోనే వెళ్లిపోయినా వారు అందించిన సేవలు, మాటలు ఎప్పటికీ ప్రజల మనసుల్లో చిరుస్థాయిగా నిలిచిపోతాయన్నారు. ఈ కార్య క్రమంలో వైయస్ కుటుంబ సభ్యులు, నాయకులు కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## అంజన్న ఆలయంలో విశేష పూజలు
## ప్రత్యేక అలంకారంలో వీరాంజనేయ స్వామి



**సింహాద్రిపురం - సూర్య వాస్తవం :** సింహాద్రిపురం గ్రామంలో అతి పురాతనమైన ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస్ ఆచార్య ఆధ్వర్యంలో ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ధనుర్మాసాన్ని పురస్కరించుకుని వేకువజామునే స్వామివారికి పంచామృత అభిషేకం సహస్రనామార్చన అష్టోత్తర శతనామావళి తదితర పూజ కైకర్యాల అనంతరం స్వామివారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రధాన అర్చకులు నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి శనివారం మంగళవారం భక్తులు మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకొని విశేష పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించి పూజలు నిర్వహించడం జరుగుతుందని, అంతేకాకుండా మంగళవారం శనివారాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. రానున్న ముక్కోటి ఏకాదశి పర్వదినాన వేకువజామున నుండి విశేష పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు ఆలయ నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆటో యూనియన్‌కి దుప్పట్లు పంపిణీ రైల్వే ఐ ఓ డబ్ల్యూ నాగేశ్వర్ నాయక్




**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి పట్టణంలో గుత్తి ఫోర్ట్ రైల్వే స్టేషన్‌లో దుప్పట్లు పంపిణీ చేసిన రైల్వే అధికారి ఐ.ఓ.డబ్ల్యూ నాగేశ్వర్ నాయక్, గుత్తి మున్సిపల్ మేనేజర్, రాంబాబు గుత్తి కోట సంరక్షణ సమితి సలహాదారులు బిల్లేకల్లు రంగనాథ్ రావు పంపిన దుప్పట్లను శనివారం గుత్తి ఫోర్ట్ రైల్వే స్టేషన్‌లో రైల్వే ఐఓడబ్ల్యూ నాయక్, మున్సిపల్ మేనేజర్ రాంబాబు ఆటో కార్మికులకు పంపిణీ చేసారు. ఈ సందర్బంగా గుత్తి కోట సంరక్షణ సమితి సభ్యులు 2026 నూతన క్యాలెండర్‌ను నాయక్ చేతుల మీదుగా, ప్రయాణికులకు, ఆటో యూనియన్ వారికి అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సంరక్షణ సమితి చేస్తున్న పోరాటానికి తమ మద్దతు ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంరక్షణ సమితి అధ్యక్షు లు విజయభాస్కర్ లీగల్ అడ్వైజర్ గంగాధర్ కుమార్ గౌరవ సలహాదా రులు స్టోర్ నాగరాజు కొలిమి నిజాం కళ్యాణ్ ఖన్నా, దస్తగిరి సోషల్ మీడియా కన్వీనర్ శివ రైల్వే అధికారులు ఆటో యూనియన్ నాయకులు నాగార్జున, సామజిక కార్యకర్త ఆటో నజీర్, ఆటో కార్మికులు సమితి సభ్యుల బృందం పాల్గొన్నారు.

## పోలీస్ నిఘా నీడలో ఆర్టీసీ బస్టాండ్....!

### - డాగ్ స్క్వాడ్‌తో సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ ప్రత్యేక తనిఖీలు





**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం:** సంక్రాంతి పండుగ వేళ అనంతపురం ఆర్టీసీ బస్టాండులో డాగ్ స్క్వాడ్‌తో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ ప్రత్యేక తనిఖీలలో అనంతపురం మూడవ పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ నేతృత్వంలో సిబ్బంది, సీసీఎస్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్లు శేషగిరి, రామయ్య, ఎస్సై రాజశేఖర్ రెడ్డి, వారి సిబ్బంది, జిల్లా డాగ్ స్క్వాడ్ బృందం పాల్గొన్నారు. బస్టాండ్, చుట్టుపక్కల ప్రాంతాలలో, గంజాయి, మాదకద్రవ్యాలు, పేలుడు పదార్థాలు వంటి అసాంఘిక వస్తువుల కోసం పరిశీలనలు జాగ్రత్తగా నిర్వహించారు. పిక్ ప్యాకెటింగ్, చైన్ స్నాచింగ్, బ్యాగ్ లిఫ్టింగ్ వంటి అవాంఛనీయ ఘటనల్ని నివారించడానికి ముందస్తు చర్యలలో కూడా ప్రత్యేక శ్రద్ధ చూపారు. బస్టాండ్‌లోని రద్దీ ప్రదేశాలలో ప్రజల భద్రత కోసం పోలీస్ విభాగం దృఢమైన ఏర్పాట్లు చేసిందని పేర్కొన్నారు.

**ప్రజలకు సూచనలు**

సంక్రాంతి సెలవుల సందర్భంగా ప్రయాణిస్తోన్నప్పుడు మీ విలువైన వస్తువులను జాగ్రత్తగా కాపాడుకోవాలన్నరు. ఇతర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు పోలీసులు ఏర్పాటు చేసిన ఎల్‌హెచ్‌ఎంఎస్ సిస్టమ్‌ను తప్పనిసరిగా ఉపయోగించాలని ఈ చర్యల కారణంగా ప్రజలు తమ సెలవులను సురక్షితంగా, ఆనందంగా గడపగలరని తెలిపారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )